ఆంధ్రజ్యోతి

20

జనగామ



www.andhrajyothi.com | బుధవారం 2, ఆగస్టు 2017 | JANGAON

ఘన్‌పూర్ బాలికల హైస్కూల్లో 'త్రీఆర్స్' ప్రారంభించిన డీఈవో 9



మాట్లాడుతున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి

హరితహారం సామాజిక బాధ్యత

- ఆర్టీసీకి బడ్జెట్‌లో రూ.1000 కోట్లు
- 1200 గ్రామాలకు బస్ సౌకర్యం
- అన్ని జిల్లాల్లో డ్రైవర్లకు శిక్షణ కేంద్రాలు
- జనగామ డిపోకు త్వరలో వజ్ర బస్సులు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి

హరితహారం కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించి విజయవంతం చేయాలని రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జనగామ పట్టణంలో మంగళ వారం ఆయన ఎమ్మెల్సీ బోడకుంటి, ఎమ్మెల్యే ముత్తిరెడ్డితో కలిసి పలుచోట్ల మొక్కలు నాటారు. ప్రజల సహకారంతో హరితహారం కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని కితాబిచ్చారు. త్వరలో జిల్లాకు వజ్ర బస్సులను అందిస్తామన్నారు.

వివరాలు : 2లో..



జాడలేని ఓడీఎఫ్

- నత్తనడకన మరుగుదొడ్ల నిర్మాణం
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షించని అధికారులు
- బిల్లుల మంజూరులో జాప్యం
- అర్ధాంతరంగా నిలిచిన పనులు
- గడువులోగా పూర్తవడం కష్టమే

"ఆగస్టు 15లోగా జనగామ మునిసిపాలిటీ పరిధిలోని ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా చర్యలు తీసుకోవాలి" అని ఇటీవల మునిసిపల్ శాఖ సమీక్ష సమావేశంలో మంత్రి కేటీఆర్ జిల్లా అధికారులకు సూచించారు. అంటే గడువు మరో 13 రోజులు మాత్రమే ఉంది. ఈలోగా పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరుతుందా? లేదా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. - ఆంధ్రజ్యోతి, జనగామ

సెంటర్ స్ప్రెడ్...

హరితహారం సామాజిక బాధ్యత



మొక్క నాటుతున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి డాక్టర్.పి.మహేందర్‌రెడ్డి

- ఆర్టీసీకి బడ్జెట్‌లో రూ.1000 కోట్లు
- 1200 గ్రామాలకు బస్ సౌకర్యం
- అన్ని జిల్లాల్లో డ్రైవర్లకు శిక్షణ కేంద్రాలు
- జనగామ డిపోకు త్వరలో వజ్ర బస్సులు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి



మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు

జనగామ, ఆంధ్రజ్యోతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం మూడో విడత కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా తీసుకొని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం మంత్రి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. పెంబర్తిలోని రవాణ శాఖ యూనిట్ నూతన కార్యాలయ నిర్మాణం జరిగే ప్రదేశంలో శాసనమండలి విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. వారికి సర్పంచ్ బాల్దె సిద్దిలింగం, జడ్పీటీసీ బాల్దె విజయ, ఎంపీటీసీ మోత్కూరి కావ్యశ్రీ, రవాణ శాఖ అధికారులు మంత్రి ఘనస్వాగతం పలికారు. స్థానిక ప్రజాప్రతినిధుల కోరిక మేరకు పెంబర్తి వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సుల హాల్టింగ్‌కు మంత్రి సానుకూలంగా స్పందించారు. జనగామ ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి అధ్యక్షత వహించగా మంత్రి మాట్లాడుతూ నష్టాలలో ఉన్న ఆర్టీసీకి బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించి సంస్థను పూర్వవైభవం తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సంస్థ ద్వారా 1400 బస్సులు కొనుగోలు చేశామని, ఉమ్మడి వరంగల్ జిల్లాకు 120 కొత్త బస్సులు కేటాయించామని, జనగామ డిపోకు త్వరలో వజ్ర ఏసీ బస్సులు అందిస్తామని అన్నారు. జిల్లా కేంద్రం నుంచి నేరుగా రాజధానికి వజ్ర బస్సులు నడిపిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1200 గ్రామాలకు రోడ్డు, రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. అన్ని జిల్లాల్లో డ్రైవర్లకు శిక్షణ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని, ఇందుకు ఐదెకరాల స్థలం కేటాయించాలని సూచించారు. ప్రజల సహకారంతో హరితహారం కార్యక్రమం సామాజిక ఉద్యమంలా సాగుతోందన్నారు. మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయ పథకాలతో పాటు హరితహారం లాంటి కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. హరితహారంలో భాగంగా ప్రతి విద్యార్థి పది మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు.

శాసనమండలి విప్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొక్కల సంరక్షణ బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. వర్షాభావ ప్రాంతమైన జనగామలో లక్ష్యం మేరకు 85 లక్షల మొక్కలు నాటాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో మొక్కలు నాటే సంస్కృతిని అలవరచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ హరితహారంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కలెక్టర్ శ్రీదేవసేన మాట్లాడుతూ జిల్లా ప్రజలు చైతన్యవంతులై వారానికి ఓ రోజు గార్డెనింగ్ డే పాటించి జిల్లాలో ప్రతి చోట పచ్చదనం పెరిగేలా చూడాలన్నారు.

కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ జి.ప్రేమలతారెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ బండ పద్మ, జడ్పీటీసీ బాల్దె విజయ, ఎంపీపీ బైరగోని యాదగిరి, ఎంపీటీసీ మోత్కూరి కావ్యశ్రీకిషన్, డీటీవో శివలింగయ్య, అధికారులు రమేష్ రాథోడ్, సాయి చరణ్, పంచాయతీ కార్యదర్శి సాంబయ్య, వీఆర్వో పద్మ, నాయకులు బండ యాదగిరిరెడ్డి, తిప్పారపు ఆనంద్, ఉల్లెంగుల కృష్ణ, బక్క లక్ష్మణ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ గరిమిళ్ల సత్యనారాయణ, రీజినల్ మేనేజర్ తోట సూర్యకిరణ్, డీవీఎం రాములు, డిపో మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



హరితహార ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మిషన్ భగీరథ పనులు వేగవంతం

- త్వరలోనే ఇంటింటికీ రక్షిత తాగునీరు
- ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణానికి శంకుస్థాపన
- పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు



వెంకటాపురంలో ఓహెచ్‌ఎస్‌ఆర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: మిషన్ భగీరథ పనులను వేగవంతం చేసి త్వరలోనే ఇంటింటికీ రక్షిత తాగునీటిని అందించడానికి కృషి చేస్తున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మంగళవారం తొర్రూరుతో పాటు అమ్మాపురం, జీకే తండా, వెంకటాపురం గ్రామాల్లో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2.60 కోట్లతో తొర్రూరులో ఎనిమిది చోట్ల ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం, రూ.84లక్షలతో అమ్మాపురంలో 2, జీకే తండాలో 1, కొత్తగూడెంలో 1 ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు, రూ.61లక్షలతో వెంకటాపురం గ్రామంలో 1, తండాల్లో 3 ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల నిర్మాణం జరుగుతోందన్నారు. కలుషిత నీటిని తాగడం మూలంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని సీఎం కేసీఆర్ గమనించి గోదావరి జలాలను శుద్ధి చేసి ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల ద్వారా నిరంతరం తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ధరావత్ రాజేష్‌నాయక్, శీలం వెంకన్న, ఎం.రమేష్, ఎంపీపీ కర్నె సోమయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎన్.కొమురయ్య, వైస్ ఎంపీపీ ఈనేపల్లి శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాల కేంద్రం అభివృద్ధి కోసం కృషి

తొర్రూరు పాలశీతలీకరణ కేంద్రం అభివృద్ధి కోసం కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. పాలకేంద్రం వద్ద రూ.5లక్షలతో నిర్మించే ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.20లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం పాల కేంద్రం ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ డెవలప్‌మెంట్ చైర్మన్ లోక భూమారెడ్డి, డైరీ మేనేజర్ వెంకటనారాయణ, చైర్మన్ రాసాల సమ్మయ్య, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏసిరెడ్డికాలనీ వద్దే కలెక్టరేట్

- 25 ఎకరాల్లో భవన నిర్మాణం
- గుడిసెవాసులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం స్థలంపై వివాదం లేదు
- కలెక్టర్ శ్రీదేవసేన



జనగామ, ఆంధ్రజ్యోతి: సూర్యాపేట రోడ్డులోని దేవాదాయ శాఖ భూముల్లోనే కలెక్టర్ కార్యాలయం నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కలెక్టర్ శ్రీదేవసేన తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. ఏసిరెడ్డినగర్ గుడిసెవాసులు నివాసం ఉంటున్న దేవాదాయ శాఖ భూమి 38 ఎకరాలు ఉండగా అందులో 30 ఎకరాలలో కలెక్టరేట్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, కానీ ప్రభుత్వం 25 ఎకరాలలో నిర్మించేందుకు ఆమోదం తెలిపి రూ.7.50 కోట్ల నిధులు కూడా విడుదల చేసిందని అన్నారు. దేవాదాయ శాఖకు చెల్లించాల్సిన సొమ్ము సంబంధించి ధర కూడా ఖరారైందని, ఈ మేరకు నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. ఆందోళన చేస్తున్న ఏసీరెడ్డినగర్ గుడిసెవాసుల్లో అర్హులైన వారికి బాణాపురం ప్రాంతంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి ఆమోదం లభించిందని, ఈ మేరకు లేఅవుట్ కూడా తయారైందని అన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలంపై ఎలాంటి వివాదం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయానికి శిఖం భూమి కావాలని ఎమ్మెల్యే కోరినప్పటికీ అందుకు తగిన నియమ నిబంధనలు లేవన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన స్థలంపై ఎలాంటి కేసులు లేవని హైకోర్టు స్పష్టం చేసిన తర్వాతే భూ సేకరణ జరిగిందన్నారు. కొంత మంది మరో కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చినప్పటికీ అది కూడా త్వరలోనే వెకెట్ అవుతుందన్నారు.

రేపు టూరిజం శాఖ ఎండీ రాక

పాలకుర్తి టూరిజం సర్క్యూట్ ఏర్పాటులో భాగంగా అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాలను సందర్శించేందుకు ఈ నెల 3న టూరిజం శాఖ మేనేజింగ్ డైరెక్టర్ స్మిత భగవత్, టూరిజం శాఖ చైర్మన్ పేర్వారం రాములు పాలకుర్తితో పాటు ఖిలాషాపురం గ్రామం సందర్శిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అభివృద్ధి పనుల మ్యాప్స్ సిద్ధం చేశామని, ఎక్కడ ఏ పనులు చేపట్టాలో వారు నిర్ణయిస్తారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలకుర్తి పర్యాటనలో భాగంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.40 కోట్ల నిధులకు అప్రూవల్ లభించిందన్నారు. బమ్మెర, వల్మిడి, పాలకుర్తి సోమేశ్వర ఆలయం, జఫర్‌గడ్, ఖిలాషాపురం గ్రామాలలో అభివృద్ధి పనులకు ఈ నిధులు ఖర్చుచేస్తామన్నారు. పనులకు సంబంధించి ప్రణాళికలు తయారుచేశామని ఎక్కడక్కెడ ఎలాంటి పనులు చేపట్టాలో స్థానిక ప్రజలతో కూడా చర్చించామని అన్నారు. పనుల నిర్వహణకు గాను ప్రత్యేకంగా ఒక కన్సల్టెంట్‌ను నియమించామని, పనులు టూరిజం శాఖ ద్వారా కాకుండా కలెక్టర్ ఆధ్వర్యంలో చేయాలని ప్రభుత్వ నిర్ణయించిందని అన్నారు. బమ్మెరలో పోతన సమాధి అభివృద్ధి, వాగులో వాటర్ షెడ్ నిర్మాణం, ఆడిటోరియం నిర్మించనున్నామని, అదే విధంగా అక్కడ పొలంలో బమ్మెర పోతన నాగలికట్టి దున్నే విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. పాలకుర్తి సోమనాథుడికి గుర్తుగా ఆడిటోరియం నిర్మాణం, కల్యాణ మండపం, నాలుగు దర్వాజల నిర్మాణం, ఆలయంలో వసతులు కల్పిస్తామని తెలిపారు.

ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

డీసీపీ తేజావత్ వెంకన్న

జనగామ టౌన్: తరుచూ ఘోర ప్రమాదాలు జరిగే ఆక్సిడెంట్ జోన్‌లలో ప్రమాదాల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నివారణ చర్యలు చేపట్టుతామని డీసీపీ తేజావత్ వెంకన్న అన్నారు. జిల్లా పరిధిలోని హైదరాబాద్- హన్మకొండ, జనగామ- సిద్దిపేట జాతీయ రహదారులపై మంగళవారం ఆర్‌అండ్‌బీ, మునిసిపల్ రవాణా పోలీసు శాఖ, అధికారుల బృందంతో కలిసి ఆక్సిడెంట్ ప్రోన్ జోన్(ప్రమాదాలు జరిగే ప్రాంతం)లను పరిశీలించి, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేసి రహదారులపై ప్రమాదాల నివారణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ టీ.పద్మనాభరెడ్డి, సీఐమునికె శ్రీనివాస్, ఏఎంవీఐ సాయిచరణ్, మునిసిపల్ డీఇ రవికిరణ్, ఆర్అండ్ డీఇ రాజు, ఎస్సైలు పాల్గొన్నారు.



పెంబర్తి వద్ద జాతీయ రహదారిపై ఆక్సిడెంట్ జోన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ

బచ్చన్నపేటలో...

బచ్చన్నపేట: మండలంలో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పోలీసు, ఆర్‌అండ్‌బీ, ఎంవీఐ అధికారులు మంగళవారం పరిశీలించారు. తమ్మడపల్లి నుంచి గంగాపూర్ క్రాస్ రోడ్ వరకు అత్యంత ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు, ఎక్కువ ప్రమాదాలు జరిగే స్థలాలను డీసీపీ తేజావత్ వెంకన్న, ఏసీపీ పద్మనాభరెడ్డి, సీఐ కరీముల్లాఖాన్, ఎస్సై భరత్, అసిస్టెంట్ ఎంవీఐ సాయిచరణ్, ఆర్‌అండ్‌బీ ఏఈ రవీందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ముమ్మందు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటే బావుంటుందనే విషయమై ఆయా శాఖల అధికారులు చర్చించుకున్నారు.

నేడు శ్రీబాంకెట్స్ ఫంక్షన్ హాల్ ప్రారంభం

జనగామ టౌన్: జిల్లా కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాంకెట్స్ ఫంక్షన్ హాల్‌ను ఈనెల 2వ తేదీన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రారంభిస్తారని నిర్వహకులు మర్యాల ఆశోక్ గుప్తా తెలిపారు. శ్రీబాంకెట్స్ ఏసీ, నాన్ ఏసీ సౌకర్యం గల ఫంక్షన్ హాల్ జిల్లా ప్రజలకు అందుబాటులో రావడం జరిగిందన్నారు. ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తండ్రిని హత్యచేసిన తనయుడు



మృతి చెందిన నర్సయ్య (ఫైల్)

గుండాల : తన కళ్ల ముందే తల్లిని అసభ్యంగా దూషిస్తున్న తండ్రి అన్నెపర్తి నర్సయ్య (48) ను కుమారుడు హత్య చేసిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుండాలకు చెందిన అన్నెపర్తి నర్సయ్య మద్యం సేవించి వచ్చి సోమవారం ఉదయం భార్య ఈదమ్మను తిడుతుండగా జీర్ణించుకోలేని కుమారుడు నాగరాజు తండ్రిని కర్రతో దాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కాగా, హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో వైద్యం అందిస్తుండగా మృతి చెందా డు. మృతుడి తల్లి ఈదమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పురేందర్‌భట్ తెలిపారు.



వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య



సత్తు శ్రీలక్ష్మి (ఫైల్ ఫోటో)

స్టేషన్‌ఘన్‌పూర్: వరకట్న వేధింపులు తట్టుకోలేక సత్తు శ్రీలక్ష్మి (23) అనే వివాహిత ఇంట్లో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఛాగల్‌లో మంగళవారం జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి... స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్ గ్రామానికి చెందిన సత్తు అనిల్, చిలుపూర్ మండలం వెంకటేశ్వరపల్లె (పల్లె)కు చెందిన కత్తెరశాల శ్రీలక్ష్మిలు ఏడాది కిందట రెండు కుటుంబాలను ఎదిరించి ఐనవోలు శ్రీ మల్లిఖార్జునస్వామి ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి వైవాహిక జీవితంలో నెల వయస్సు ఉన్న పాప ఉంది. పెళ్లై ఏడాది కావస్తున్నా పుట్టింటి నుంచి ఎలాంటి కట్న కానుకలు తీసుకు రావడం లేదని అత్తింటి వారు వేధిస్తుండేవారని ఆ వేధింపులు భరించలేక మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆర్.నరేందర్ తెలిపారు.

కాగా, సంఘటనా స్థలాన్ని ఏసీపీ, తహసీల్దార్ పరిశీలించారు. పెళ్ళైన ఏడాదికే వివాహిత ఆత్మహత్య చేసుకోవడంపై స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ పుల్ల సంజీవరావు, తహసీల్దార్ జి.సదానందంలు విచారణ చేశారు.

గొల్ల, కురుమల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ రూరల్ : గొల్ల కురుమల జీవితాల్లో వెలుగులు నింపింది కేసీఆరే అని స్థానిక శాసన సభ్యులు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చౌడారంలో గొర్రెల అభివృద్ధి పథకం కింద గొర్రె పిల్లలను లబ్ధిదారులకు అందచేశారు. జీవనోపాధికి గొర్రె పిల్లలను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి సర్పంచ్ సలేంద్ర కొమరయ్య అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుల వృత్తులకు ఆదరణ కల్పించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. దేశంలోనే ఇలాంటి బృహత్తర కార్యక్రమ చేపట్టినందుకు అన్ని రాష్ట్రాల చూపు తెలంగాణ వైపు ఉందన్నారు. రాష్ట్రంలో బతుకుతున్న సబ్బండ జాతులకు, కులాలకు వారి వృత్తుల ఆధారంగా జీవనోపాధి కల్పిస్తున్నారని తెలిపారు. అంతకు ముందు గ్రామంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. నాటిన ప్రతీ మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. విద్యార్థులు మొక్కల పెంపకంలో జాగత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బైరగోని యాదగిరి, జడ్పీటిసీ బాల్దె విజయ, ఎంపీటీసీ దూడల సిద్దయ్య, ఎంపీడీవో మహ్మద్ హాషీం, ఎస్సై సంతోషం రవీందర్, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మేకల కళింగరాజు, ఎల్లబోయిన కొమరయ్య, ప్రశాంత్, కురుమ సంఘం అధ్యక్షుడు చెరుకూరి రామరాజు, మాజీ సర్పంచ్ చెరుకూరి యాదయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

చిలుపూర్ : ప్రమాదవశాత్తు బావిలో పడి గొర్రెల కాపరి మృతి చెందినట్లు చిలుపూర్ ఎస్సై ఎం. కరుణాకర్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన బుస్స వెంకటయ్య (65) గొర్రెలను కాస్తూ జీవనం సాగించేవాడని, గ్రామ శివారులో ఉన్న మొండికుంట వద్ద గొర్రెలను మేపుతుండగా గొర్రె పిల్ల బావిలో పడ్డ విషయాన్ని గుర్తించి కాపాడటానికి ప్రయత్నించగా గొర్రెపిల్ల బరువును ఆపలేకపోవడంతో నీటిలో మునిగి మృతిచెంది ఉంటాడన్నారు. స్థానిక సర్పంచ్ ఎర్రబెల్లి చేరాలు సహకారంతో నీటికి వెలికితీసి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడి భార్య కాలం చేయగా, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

వివాహిత అదృశ్యం



లక్ష్మి (ఫైల్)

తరిగొప్పుల: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన పడతం లక్ష్మి (22) సోమవారం మధ్యాహ్నం అదృశ్యం అయిం దని తరిగొప్పుల ఎస్సై భూక్య రాజేష్ నాయక్ తెలిపారు. భర్త వెంకటేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆచూకి తెలిసినవారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

విద్యుదాఘాతంతో బిహార్ యువకుడి మృతి



మృతి చెందిన భూటాన్

గుండాల: మండలంలోని వంగాల గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో బిహార్‌కు చెందిన యువకుడు భూటాన్ (21) మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలో మెఘా వాటర్‌షెడ్ పనుల్లో భాగంగా వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ తిప్పల్లపల్లి యాదమ్మకు చెందిన వ్యవసాయ బావి వద్ద కుంట నిర్మాణం చేపట్టేందుకు లారీలో ఇటాచిని తీసుకొస్తుండగా గ్రామం శివారులో 11 కేవీ విద్యుత్ తీగలు లారీకి తగిలి బిహార్ రాష్ట్రానికి చెందిన భూటాన్ అక్కడిక్కడే మృతి చెందగా మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడకు చెందిన హెల్పర్ గోపాల్ పైనుంచి దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ పరార్ కాగా, భూటాన్ మృతదేహాన్ని ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పురేంధర్‌భట్ తెలిపారు.



'మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే'

బచ్చన్నపేట: మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసుల పాలవుతారని ఎస్సై మోదుగు భరత్ హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ జూలై 29న రాత్రి వాహనాల తనిఖీలో భాగంగా మద్యం తాగి వాహనం నడుపుతున్న కె. ఆంజనేయులు, ఎర్ర అరుణ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా అంజనేయులుకు రెండు రోజుల జైలుశిక్ష, రూ. 500లు జరిమానా, అరుణ్‌కు రూ. 2 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. వాహనాలు నడిపేవారు నిబంధనలు పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు.

ఇంటర్వ్యూ

వందశాతం మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి



ఉమామహేశ్వర్, ఎంపీడీవో, దేవరుప్పుల

ప్ర: మండలంలో హరితహారం లక్ష్యం ఎంత?

జ: 7లక్షల 20వేలు లక్ష్యం కేటాయించగా 2,22, 760మొక్కలు ఇప్పటి వరకు నాటాం. లక్షా 10వేలు మహిళా సంఘాలకు పంపిణీ చేశాం.

ప్ర: గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం ఎంత వరకు వచ్చింది?

జ: మండలంలోని మొత్తం గ్రామాల్లో 1425 మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాం. ఇప్పటి వరకు 630 పూర్తయ్యాయి. మిగతావి కూడా ఫైనల్‌స్టేజీకి వచ్చాయి. త్వరలో ఓడీఎఫ్ మండలంగా తీర్చిదిద్దుతాం. రూ. 10లక్షల చొప్పున నాలుగు గ్రామాలకు శ్మశానవాటికలు మంజూరయ్యాయి. నీర్మాల, రాంరాజుపల్లి, చిన్నమడూరు, దేవరుప్పుల గ్రామాలకు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

- దేవరుప్పుల

'కాకతీయ' పనుల్లో నాణ్యత కరువు

- పగుళ్లు పట్టిన నీర్మాల దుగ్గిని చెరువు కట్ట
- రూ. 15.82 లక్షల ప్రజాధనం వృథా
- అవినీతి కాంట్రాక్టర్‌కు సహకరిస్తున్న అధికారులు



పగుళ్లు పట్టిన చెరువుకట్ట

దేవరుప్పుల: మిషన్ కాకతీయ పథకంలో భాగంగా మండలంలోని నీర్మాల గ్రామంలోని దుగ్గిని చెరువు పునరుద్ధరణ కోసం ప్రభుత్వం మొదటి విడతలో రూ. 62.15లక్షలు నిధుల కేటాయించింది. అయితే ఇందులో చెరువు కట్ట నిర్మాణానికి రూ. 22.77 లక్షలు, పూడికతీత వ్యయం రూ. 13.98లక్షలు, మత్తడి నిర్మాణం కోసం రూ.14.39లక్షలు, తూము మరమ్మతుకు రూ.2.70లక్షలు, కాల్వల నిర్మాణానికి రూ. 4.59లక్షలు, ఫీడర్‌ఛానల్ వ్యయానికి 0.98లక్షలు మంజూరు చేసింది. సంబంధిత కాంట్రాక్టర్ అసంపూర్తిగా పనులు చేపట్టి వదిలి వేశారు. చేసిన పనులైన చెరువుకట్ట నిర్మాణ పనులకు రూ.15.82లక్షలు, మత్తడి నిర్మాణ పనులకు 2.41, కాల్వల నిర్మాణ పనులకు 6.78లక్షలు బిల్లు చెల్లింపులు జరిపారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో చేయాల్సిన పనులు చేయకపోగా, చేసిన కొద్ది పనికి కాంట్రాక్టర్ నాణ్యతగా చేపట్టకున్నప్పటికీ అధికారులు బిల్లులు చెల్లించారు. ఆ కాంట్రాక్టర్‌తో పూర్తిగా పనులు చేయించాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించి వదిలేశారు. చేపట్టిన కట్టపని నాణ్యతగా చేయకపోవటం వల్ల పూర్తిగా పగుళ్లపట్టింది. కట్టపై రైతులు కాలినడకన నడవాలంటే జంకుతున్నారు.

సుమారు రూ. 16లక్షల వ రకు ప్రజాధనం వృథాఅయింది. మళ్లీ ప్రభు త్వం నిధులుకేటాయించి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోలింగ్ చేస్తే బావుండేది: కాడబోయిన శోభన్‌కుమార్

కట్టకు మరమ్మతులు చేసినప్పుడు సంబంధిత కాంట్రాక్టర్ రోలింగ్ చేయించకపోవటం వల్ల పూర్తిగా పగిలిపోయింది, కట్టపై నడవాలంటే భయమేస్తోంది. రంధ్రాల్లో కాలు ఎక్కడ దిగబడి పోతుందోననిపిస్తోంది. కట్టపైకి వాహనాలు తీసుకెళ్లడమే మరిచాం.

చెరువు పనులు సక్రమంగా చేయలేదు :ఎలిమినేటి భాస్కర్

మా గ్రామంలోని దుగ్గిని చెరువు పనులు సక్రమంగా చేయనేలేదు. అధికారులు మాత్రం బిల్లు చెల్లింపులు జరిపారు. నాణ్యతగా చేస్తున్నారా లేదా అని పట్టించుకున్న పాపాన పోలేదు. మళ్లీ ఆ నిధులతో చెరువు మరమ్మతులు నాణ్యతగా చేపట్టాలి.

'ఏఐఎస్‌ఎఫ్ సభను విజయవంతం చేయాలి'

జనగామ ఎడ్యుకేషన్ : ఆగస్టు 2న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఉస్మానియా యునివర్సిటీలో జరిగే సభను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహ్మద్ దస్తగిరి పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐఎస్‌ఎఫ్-ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పలు కళాశాలలో లాంగ్ మార్చ్ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం విద్యార్థులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 'సేవ్ ఇండియా, చేంజ్ ఇండియా' పేరుతో కన్యాకుమారి నుంచి పంజాబ్‌లోని హుసేనీ వాలా వరకు లాంగ్‌మార్చ్ బస్సుయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

'అవినీతిని, ఆధిపత్యాన్ని టీమాస్ సహించదు'

జనగామ కల్చరల్: జిల్లాలో అవినీతి, ఆధిపత్యం ఎక్కడున్నా టీమాస్ ఫోరం చూస్తూ ఊరుకోదని టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆకుల వేణుగోపాలరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక విజయలక్ష్మి మినీహాల్‌లో జరిగిన టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సమావేశానికి వేణుగోపాలరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ తెలంగాణ పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాలన్నింటినీ తుంగలో తొక్కిందన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిని అణచివేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని లేని ఎడల రానున్న రోజుల్లో ప్రజాఉద్యమాల దెబ్బ చవి చూడాల్సి వస్తోందన్నారు. ప్రజాఉద్యమాలు అణచినా కొద్ది ఎక్కువగా విస్తరిస్తాయన్నారు. సమావేశంలో డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, కాలేబ్, తాటి కుమార్, ముడావత్ లక్ష్మణ్ నాయక్, చుక్క కిషన్, సాంబరాజు యాదగిరి, ఉడుత రవి, పిట్టల కుమార్, రమావత్ మీట్యా నాయక్, ఇర్రి అహల్య తదితరులు పాల్గొన్నారు.

భూవివాదాల పరిష్కారానికే పహాణీల ప్రక్షాళన

రైతులకు సూచించిన అధికారులు

తరిగొప్పుల: ప్రభుత్వం భూవివాదాల పరిష్కారానికే పహాణీల ప్రక్షాళన చేపట్టిందని దీన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎమ్డీ సలీం సూచించారు. మండలంలో మొదటివిడతగా అక్కరాజుపల్లి గ్రామంలో మంగళవారం పహణీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూఅధికారులు గ్రామంలో ప్రతీ ఇంటింటికి తిరుగుతూ రైతుల భూవివరాలు సేకరిస్తాన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోగం ఉష, ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్వోలు గంగరాజు, జయాలు, అంజయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.



తరిగొప్పులలో కొత్త పహణీలను రైతుకు ఇస్తున్న తహసీల్దార్

చిలుపూర్‌లో..

చిలుపూర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల వ్యవసాయ భూములకు సంబంధించి పహాణీల ఆధునీకరణ ప్రారంభించినట్లు ఎమ్మార్వై సురేష్ తెలిపారు. ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ గతంలో ఉన్న పహానీల స్థానంలో ఆధునిక పరిజ్ఞానంతో తయారైన పహానీలను పంపిణీ చేస్తారన్నారు. మొదటి విడతలో భాగంగా వెంకటాద్రిపేట గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు.

జఫర్‌గడ్‌లో..

జఫర్‌గడ్: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో పహాణీలను శుద్ధీకరణ చేయనున్నట్లు తహసీల్దార్ ఎం.మనోహరచారి తెలిపారు. మండలంలోని షాపల్లి, రఘునాథపల్లి గ్రామాల్లో పహాణీల క్రమబద్ధీకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్వై సంధ్యారాణి, ఏఆర్ఐ ఉమారాణి, వీఆర్వోలు కమలాకర్, శ్రీకాంత్, సదానందం, రవి, అనిల్ తదితరులున్నారు.

'గోదావరి జలాలతో చెరువులను నింపాలి'

చిలుపూర్: మండలంలోని పల్లగుట్ట గ్రామంలో ఉన్న చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపి రైతులను ఆదుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు చిర్ర ఎల్లమ్మ రాజమౌళి కోరారు. 15 రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే రాజయ్య ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

ఘనంగా ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం



కొడకండ్లలో ఆటోర్యాలీలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

కొడకండ్ల: మండలకేంద్రంలో వివిధ ఆటోయూనియన్ల ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ప్రపంచ ఆటోకార్మికుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలకేంద్రంలో మంగళవారం మండలంలోని మొండ్రాయి, గంట్లకుంట, కొడకండ్ల ఆటో యూనియన్ల సభ్యులు ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం నుంచి తెలంగాణతల్లి విగ్రహం వరకు భారీ ఆటోర్యాలీ నిర్వహించారు. మండల ఆటో యూనియన్ నాయకులు ఎమ్డీ మహమూద్, జిలకర అశోక్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో రాజు, సోమన్న, శ్రీను, వెంకన్న తదితరులున్నారు.

గుండాలలో..

గుండాల: ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం సందర్భంగా మండలంలోని సుద్దాలగ్రామంలో శ్రీరామ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి మధు, లింగం, రాజు తదితరులు పాల్గొన్నారు.

'గ్రామ స్వరాజ్యం కోసమే మిషన్ అంత్యోదయ'

రఘునాథపల్లి: గ్రామ స్వరాజ్యం కోసమే కేంద్రప్రభుత్వం మిషన్ అంత్యోదయ పథకం ప్రవేశపెట్టిందని బీజేపీ మండల అధ్యక్షుడు మంద వెంకటేశంయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన పార్టీముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పెద్దపీట వేస్తూ ఆచరణలో అమలుకు మాత్రం ఆమడదూరంలో ఉందన్నారు. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని భావించిన నరేంద్రమోడీ గ్రామస్వరాజ్య స్థాపన కోసం ప్రవేశపెట్టిన మిషన్ అంత్యోదయ పథకానికి మండలంలోని వెల్ది, ఫతేషాపురం, ఇబ్రహీంపురం ఎంపికకావడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, కె.సుధాకర్, వేణుకుమార్, కె.శ్రీనివాస్, మోహన్‌జీ, ఉపేంద్రచారి, ఆశోక్‌రెడ్డి, ఉపేందర్, తిరుమల్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్ ఎస్‌బీఐ సిబ్బంది పనితీరుపై వ్యాపారుల ఫైర్

ఏజీఎంకు ఫిర్యాదు, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ



ఏజీఎంకు ఫిర్యాదు చేస్తున్న వ్యాపార ప్రముఖులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్థానిక ఎస్‌బీహెచ్ ఇటీవల ఎస్‌బీఐగా మారిందని, సిబ్బంది అందిస్తున్న సేవలు ఏ మాత్రం బాగా లేవని పలువురు వ్యాపార ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి ఎస్‌బీఐ ఏజీఎం భరణి కుమార్ తనిఖీ చేయడానికి వచ్చారు. ఈ సందర్భంగా వ్యాపారులు ఆయనను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. సిబ్బంది సేవలు సరిగ్గా లేవని ఆరోపించారు. ఏ పని కోసం వచ్చినా తీవ్ర జాప్యం చేస్తున్నారని వాపోయారు. లక్షల రూపాయల లావాదేవీలు జరిపే తమ పట్ల ఇలా వ్యవహరిస్తున్నారంటే సామాన్యుల పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఏజీఎం భరణికుమార్ వారితో మాట్లాడుతూ ఎస్‌బీఐలో విలీనం అయిన నేపథ్యంలో త్వరలో బ్యాంకు మేనేజర్ పోస్టు భర్తీ అవుతుందన్నారు. సేవల పట్ల నిర్లక్ష్యం చేస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నల రాజేశ్వర్‌రావు, బి.భాస్కర్, రామకృష్ణ, సోమశేఖర్, రాజశేఖర్, సోమేశ్వర్, సురేష్, జి.కార్తీక్, బీఎం వివేకానంద బ్రోహ్మ తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి
స్టేషన్ ఘన్‌పూర్
జనగామ । బుధవారం 2 ఆగస్టు 2017
లింగాలఘణపురం । జఫర్‌గడ్ । స్టేషన్ ఘన్‌పూర్ । చిల్పూరు । కొడకండ్ల । పాలకుర్తి

'జాగృతి' విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడిగా అశోక్



పాలకుర్తి: జాగృతి విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడిగా మండలంలోని దర్దెపల్లికి చెందిన జలగం అశోక్‌ను మంగళవారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తన నియమానికి సహకరించిన ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎంపీ కల్వకుంట్ల కవిత, రాష్ట్ర అధ్యక్షుడు పసుల చరణ్, జనగామ జిల్లా అధ్యక్షుడు కొత్తకొండ గంగాధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చెట్లతోనే మానవాళికి మనుగడ

ఆర్డీవో వెంకట్‌రెడ్డి

తరిగొప్పుల: చెట్లతోనే మానవాళి మనుగడ సాధ్యమని జనగామ ఆర్డీవో వెంకట్‌రెడ్డి సూచించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలకేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణలో భాగంగానే ప్రభుత్వం మూడోవిడత హరితహారం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో ప్రతీ ఒక్కరు భాగస్వాములై పది మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎమ్డీ సలీం, ఆర్‌ఐ వంశీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణస్వామి, సర్పంచ్ సిద్దిని మహిపాల్, ఎంపీటీసీలు చిలువేరు సంపత్, ముడావత్ మౌనిక, వీఆర్వోలు అంజయ్య, జయాలు, రవి, గంగరాజు, ఎఫ్‌ఏ శంకర్ పాల్గొన్నారు.



తరిగొప్పులలో మొక్కలు నాటుతున్న ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్

నర్మెటలో..

నర్మెట: హరితహారంలో నాటిన ప్రతీ మొక్కను కాపాడాలని ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు అన్నారు. మండలంలోని హన్మంతాపూర్ గ్రామంలో ఎంపీటీసీ పొలెపాక తిరుపతితో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎస్సై వీరభద్రరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌రమేష్ తదితరులున్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను, వావిలాల గ్రామాల్లో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఎస్సై పద్మ నేతృత్వంలో హరితహారంలో భాగంగా ఖర్జూర, ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో 700 మొక్కలను నాటామన్నారు. గీతాకార్మికులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తాటి, ఈత, ఖర్జూర, గిరకతాళ్లను నాటుతున్నామన్నారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై వేణుగోపాల్ హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో 100 మొక్కలను నాటి 2000 మొక్కలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఎమ్డీ ఖదీర్, సర్పంచ్ సునీతపాల్గొన్నారు.

జఫర్‌గడ్‌లో..

జఫర్‌గడ్: హరితహారంలో నాటిన ప్రతీ మొక్కను కాపాడాలని ఎంపీడీవో రవీందర్ అన్నారు. ఆయన ఇక్కడ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సుబ్రమణ్యం, ఈసీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఓబులాపూర్‌లో జరిగిన హరితహారంలో ఎస్సై రాజన్‌బాబు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజన, ఎంపీటీసీ సాలమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు. మూడోవిడత హరితహారంపై ఎంపీడీవో కార్యాలయంలో నేడు నిర్వహించే అవగాహన సదస్సుకు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

నేడు టీజీవీపీ ఆధ్వర్యంలో..

జనగామ ఎడ్యుకేషన్: టీజీవీపీ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా టీజీవీపీ ఆధ్వర్యంలో హరితహార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీజీవీపీ రాష్ట్ర కార్యదర్శి పిట్టల సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాకతీయడిగ్రీ కళశాలలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు జరిగే హరితహారకార్యక్రమంలో అందరు పాల్గొనాలన్నారు. అనంతరం హరితహార కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో అజిత్, సిద్దూ గౌడ్, కనకరాజు, సాయి, సందీప్, రాజశేఖర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

రూ. 12 కోట్ల పంట రుణాలు ఇచ్చాం



నందకిషోర్,
ఏపీజీబీ మేనేజర్, పాలకుర్తి

ప్ర: ఎంత మంది రైతులకు పంట రుణాలిచ్చారు?

జ: పదిహేనువందల మంది రైతులకు బ్యాంక్‌లో ఖాతాదారులుగా చేర్పించి రూ. 12 కోట్లు పంట రుణాలను ఇచ్చాం.

ప్ర: ఎన్ని పొదుపు సంఘాలకు రుణాలిచ్చారు?

జ: బ్యాంక్ పరిధిలోని గ్రామాలకు 60 గ్రూపులకు రూ. 3 కోట్లు రుణాలను అందించాం.

ప్ర: కార్పొరేషన్ రుణాలు ఎంత మంది లబ్దిదారులకు అందించారు ?

జ : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 67 మంది లబ్దిదారులకు రూ. 67 లక్షలు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 11 మంది లబ్దిదారులకు రూ. 11 లక్షలు అందించాం.

ప్ర: ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్షా బీమా యోజన పథకంలో ఎంత మందిని ఖాతాదారులుగా చేర్పించారు?

జ: ప్రధానమంత్రి జీవనజ్యోతిలో 500 మందిని, అలాగే ప్రధానమంత్రి సురక్షా బీమా యోజనలో 500 మందిని బ్యాంక్‌లో ఖాతాదారులు చేర్పించాం.

- పాలకుర్తి

ట్రాలీ ఆటో డ్రైవర్స్ కార్యవర్గం ఎన్నిక

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ట్రాలీ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. అధ్యక్షుడిగా అల్వాల నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బోడపట్ల రాంచంద్రం, కార్యదర్శిగా ఎనుగుల రాకేష్, కోశాధికారిగా మాచర్ల సాయికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ ట్రాలీ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎనుగుల రవి, సంజయ్, ఎద్దు హరి, రమేశ్, కర్ణాకర్, భాస్కర్, అంకుష్, తదితరులున్నారు.

'ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి'

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు

లింగాలఘణపురం: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ బిల్లు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటరీ సమావేశాల్లో ప్రవేశపెట్టి చద్దబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండలంలోని నెల్లుట్ల వద్ద ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జనగామ-సూర్యాపేట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ సాధనకోసం 24 ఏళ్లుగా కొనసాగుతున్న సుదీర్ఘ పోరాటాల ద్వారా మాదిగలు తమ డిమాండ్లను పలు రూపాల్లో ప్రభుత్వాల దృష్టికి తెచ్చినా సమస్యను పరిష్కరించకుండా నాన్చివేత ధోరణిని అవలంభించడం దారుణమన్నారు. మాదిగలను మోసం చేసేందుకు కుట్రపన్నిన రాజకీయ పార్టీలు మాదిగలచేతిలో పతనం తప్పదన్నారు. సుమారు గంటపాటు జరిగిన రాస్తారోకోతో జనగామ-సూర్యాపేట రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎస్సై సూరం వేణుగోపాల్ రాస్తారోకో స్థలానికి చేరుకుని రాస్తారోకోను విరమింపచేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు గట్టగల్ల ప్రశాంత్, కుంటి మహేందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు సందెన రవీందర్, నల్ల లాజర్, శ్రీహరి, బాబు, రమేశ్, ఎల్లస్వామి, దేవేందర్ తదితరులున్నారు.



నెల్లుట్ల వద్ద రాస్తారోకో చేస్తున్న ఎంఎస్‌ఎఫ్ నాయకులు

కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి తొమ్మిదోరోజుకు చేరుకున్నాయి. దీక్షలో సందెన రవీందర్, ప్యాట ముత్తయ్య, శ్రీహరి, ప్రశాంత్ ఉపేందర్ వెంకటయ్య, నర్సయ్య, కృష్ణ, మర్మాముల స్వామి తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మాదిగ, మాదిగ ఉపకులాలు ఎలాంటి పోరాటాలకైనా సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొయ్యడ మల్లేష్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 13వ రోజుకు చేరాయి. దీక్షలో దాసన్నగూడెం ఎమ్మార్పీఎస్ నాయకులు మచ్చ అబ్బయ్య, జేరిపోతుల రవీందర్, రాము, అశోక్, శ్యామ్, సంపత్, భాస్కర్, అఖిల్ కూర్చున్నారు. దీక్షలకు కొయ్యడ భిక్షపతి, గడ్డం రాంనర్సయ్య, కుమారస్వామి, శాగంటి చందు, క్రాంతికుమార్, వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ తాళ్లపల్లి కుమార్ సంఘీభావం తెలిపారు.

'కార్మికులకు 'డబుల్' ఇళ్లు మంజూరు చేయాలి'

పాలకుర్తి: భవన నిర్మాణ కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని చాకలిఐలమ్మ స్మారక భవనంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశానికి ఎడ్ల భిక్షపతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాజు హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ కార్మికుల బతుకులు మారలేదన్నారు. సమావేశంలో సోమన్న,ఎల్లయ్య,ఆనందం,కుమార్, కొంరయ్య,పర్వతాలు, వెంకన్న తదితరులున్నారు.

'జీఎస్టీతో నష్టమే'

పాలకుర్తి: మండలకేంద్రంలో జిరాక్స్, ఆన్‌లైన్ అసోసియేషన్ కేంద్రాల యాజమానులు మంగళవారం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు అనంతుల సోమేశ్వర్, సలేంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ జీఎస్టీ ప్రభావంతో ముడిసరుకులు ధరలుపెరిగి నష్టపోతున్నామన్నారు. షాపులనిర్వహణ భారంగా మారినందుకు బంద్ పాటించామన్నారు. కార్యక్రమంలో మార్కండయ్య, యాకన్న, రవింద్రాచారీ, నాగరాజు తదితరులున్నారు.

'కోరగుట్ట క్రషర్‌ను నిలిపివేయాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం శివారు కోరగుట్ట క్రషర్, డాంబర్ ప్లాంట్‌ను తక్షణం నిలిపివేయాలని సీపీఎం పార్టీ గ్రామశాఖ కార్యదర్శి గోడిశాల యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామశాఖ ఆధ్వర్యంలో కోరగుట్ట క్రషర్, డాంబర్ ప్లాంట్ బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశీంనగర్ వాసులు నలభైఏళ్లుగా ఇక్కడ బండ కొడుతూ నివసిస్తున్నారు. క్రషర్, డాంబర్ ప్లాంట్ ఏర్పాటుతో బాంబు బ్లాస్టింగ్‌లు, పొగ, కాలుష్యం వెలువడుతుండటంతో ఇక్కడ వారు ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. కోరగుట్ట పరిసరాల్లోని వ్యవసాయ పొలాలు దెబ్బతినడం, కాశీనంనగర్ వాసుల మనుగడకు ప్రమాదంగా ఉన్న క్రషర్‌ను ప్లాంట్‌ను తక్షణం మూయించాలని లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో గట్ట మల్లారెడ్డి, మునిగెల రమేష్, యాకయ్య, ఐలయ్య, వెంకటేష్, నరేందర్, వార్డు సభ్యుడు మహిపాషా, కాశీంనగర్ వాసులు, తదితరులున్నారు.

నేడు పీఏసీఎస్ రుణమేళా

నర్మెట: మండలకేంద్రంలోని ప్రాథమికవ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నేడు రుణమేళా నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీఏసీఎస్ పరిధిలోని సుమారు 1156 మంది రైతులకుగాను 9 కోట్ల 16 వేల పంట రుణాలు మంజురైనట్లు తెలిపారు. నేడు రుణమేళా నిర్వహించి రైతులకు రుణాలు అందిస్తామన్నారు. రుణాలు మంజూరు అయిన రైతులు, పీఏసీఎస్ డైరక్టర్లు, మండల ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

'మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం'

గుండాల: మాదక ద్రవ్యాల వాడకం వల్ల భవిష్యత్తు అంధకారమవుతుందని జనగామ ఎక్సైజ్ ఎస్సై సుధీర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకంపై కలిగే దుష్పరిణామాలపై అవగాహన నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు స్నేహాలు మానుకోవాలి. మాదకద్రవ్యాలు వాడటం వల్ల సమాజంలో గుర్తింపు కోల్పోతామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సై వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ సురేశ్ తదితరులున్నారు.

108 సేవలను తనిఖీ చేసిన అధికారులు

జనగామ టౌన్: జిల్లావ్యాప్తంగా 108 వాహనాల్లో సౌకర్యాలను మంగళవారం సంస్థ రాష్ట్ర స్థాయి అధికారులు విస్తృతంగా పరిశీలించారు. జనగామ ఏరియా ఆస్పత్రిలో 108 సేవలను రీజనల్ మేనేజర్ ఖలీల్, హెచ్‌వోడీ సత్యనారాయణ అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. గర్భిణులు, క్షతగాత్రులకు 108 ద్వారా సకాలంలో అందించే సేవలను అభినందించారు. ఉత్తమ సేవలు అందించిన సిబ్బంది నరేష్, రవికుమార్‌కు ప్రశంస పత్రాలు అందించారు.


108 సేవలను పరిశీలిస్తున్న అధికారులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్‌లో కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. గ్రామంలోని డాగ్‌బంగ్లా ముందున్న చెత్తాచెదారంను తొలగించారు. ఈ సందర్భంగా గ్రామశాఖ అధ్యక్షుడు మామిండ్ల ఓదెయ్య మాట్లాడుతూ గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వర్షాకాలంలో ప్రభలే వ్యాధులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో కుందూరు వెంకట్‌రెడ్డి, గణేష్, ప్రభాకర్, సుధాకర్, కుమార్ తదితరులున్నారు.

'వీఆర్‌ఏలపై దాడులు అరికట్టాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: వీఆర్‌ఏలపై నిత్యం జరుగుతున్న దాడులను నివారించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు మ్యాకల వెంకటయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలకేంద్రంలో జరిగిన వీఆర్‌ఏల సమావేశంలో మాట్లాడుతూ వీఆర్‌ఏలు ప్రభుత్వ జీవో ప్రకారం విధులు నిర్వహిస్తుంటే కొందరు వాటా, ఇస్సాదారులమని దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సహాయకులుగా సేవలందిస్తున్న తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం వీఆర్‌ఏల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా మ్యాకల వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా నీల రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా కట్ట గట్టుమల్లు, సహాయ కార్యదర్శులుగా కాగితాల వెంకట్రాజం, గుండె పోషయ్య, కోశాధికారిగా గుర్రం రాజేశ్వరీని ఎన్నుకున్నారు. సమావేశంలో చొక్కం నర్సయ్య, బత్తుల బాలరాజు, అక్కెనపల్లి సంపత్, రామస్వామి, రాజ్‌కుమార్, రవిచంద్ర, మల్లేశం, వెంకటయ్య, అశోక్‌లు పాల్గొన్నారు.

వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో రక్షాబంధన్

జనగామ కల్చరల్: వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని శ్రీగాయత్రీ జూనియర్ కళాశాలలో జరిగిన రక్షాబంధన్ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మేక బాలసిద్ధయ్య మాట్లాడుతూ దేశభక్తి కలిగి ఉన్న ప్రతీ ఒక్కరు మనదేశం ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించాలన్నారు. తక్కువ ధరలో ఉన్నాయని చెబుతూ చైనా వస్తువులను కొనుగోలు చేసే సంస్కృతిని విడిచిపెట్టాలన్నారు. మన సంస్కృతిని, ధర్మాన్ని మనమే రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యనిర్వాహక సభ్యుడు దొంతుల శేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు ప్రదీప్, ఇన్‌చార్జి ఆడెపు కవిత, వార్డెన్ బింగి మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వర రెడ్డిసంఘం అధ్యక్షుడిగా అరవింద్‌రెడ్డి



బచ్చన్నపేట: మండలంలోని కేశిరెడ్డిపల్లి సిద్ధేశ్వర రెడ్డి సంఘం ఎన్నికలు మంగళవారం జరిగాయి. అధ్యక్షుడిగా మల్లవరం అరవింద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్రా భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా బందెల కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ తనకు రెండోసారి అవకాశం కల్పించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డి సామాజిక వర్గంలో నిరుపేదలు ఎంతో మంది ఉన్నారని, రిజర్వేషన్ల మూలంగా వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం నిరుపేద రెడ్డిలను ఆదుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించాలన్నారు. సమావేశంలో ఇమ్మడి సత్యనారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, నర్ర రాజిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఎడబోయిన రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో స్వీపింగ్ మిషన్

పాలకుర్తి: పాలకుర్తి గ్రామంలోని రోడ్లు, వీధులు ఊడ్చేందుకు (శుభ్రం) స్వీపింగ్‌మిషన్‌ను కొనుగోలు చేశారు. గ్రామపంచాయతీలో పారిశుధ్య నిర్వహణ కోసం ఈ యంత్రాన్ని కొనుగోలు చేశారు. దీంతో మంగళవారం పాలకుర్తి ప్రధాన రోడ్డును శుభ్రం చేశారు. ఈ మిషన్‌ను గ్రామస్థులు వింతగా చూశారు.


పాలకుర్తిలో ఊడుస్తున్న స్వీమింగ్ మిషన్

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 5

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో ప్రోత్సాహకరం. ఉన్నత విద్యా విషయాలు, సమావేశాలు, చర్చల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు, వ్యూహరచనలకు అనుకూలం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. ఇంటి అవసరాలకు సకాలంలో డబ్బు చేతికి అందుతుంది. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. బంధుమిత్రులతో సమావేశాలు ఫలిస్తాయి. ప్రియతముల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. సమావేశాల్లో, బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగులు సహకరిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. క్యాటరింగ్, రిటైల్ రంగం, హోటల్, వైద్య రంగాల వారికి ప్రోత్సాహ

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. సృజనాత్మక రంగాల వారికి ప్రోత్సాహకరం. చిన్నారుల విషయంలో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. బదిలీలు, మార్పులకు సంబంధించి ముఖ్య సమాచారం అందుకుంటారు. సంస్మరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాంత్వన కలిగిస్తాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో అదనపు ఆదాయం అందుకుంటారు. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో పెద్దల నుంచి మంచి సలహాలు లభిస్తాయి.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): అంచనాలు ఫలించడంతో మనసు ఉల్లాసంగా ఉంటుంది. కొత్త పనులు ప్రారంభిస్తాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల కోసం నిధుల సేకరణకు ప్రయత్నిస్తారు. ప్రయాణాలు, సమావేశాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు. పెట్టుబడులు ప్రోత్సాహకరం. బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. భాగస్వామి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

రోడ్డు ప్రమాదాల నివారణకు కొత్త చట్టాలు

హైవేలపై మద్యం షాపుల మూత
రూ.360 కోట్లతో 1400 బస్సుల కొనుగోలు
రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కొత్త చట్టాలను తీసుకరావడంతోపాటు హైవేలపై ఉన్న వైన్‌షాపులను మూసివేస్తామని రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ములుగురోడ్ సమీపంలో గల ఆర్టీసీ జోనల్ శిక్షణ కేంద్రంలో మంగళవారం హరితహారం లో భాగంగా మంత్రి మొక్కలు నాటారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నిత్యం కోటికి పైగా వాహనాలు సంచరిస్తున్నాయని, వివిధ ప్రమాదాల మూలంగా నెలకు 7 వేల మంది మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు, సురక్షితమైన ప్రయాణానికి ప్రభుత్వం త్వరలో రవాణా శాఖలో కొత్త చట్టాలను తీసుకురాబోతుందన్నారు.


ఆర్టీసీ జోనల్ శిక్షణ కేంద్రంలో మొక్కలు నాటుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

ప్రధానంగా హైవేలపై ఉన్న మద్యం దుకాణాలను మూసివేయడంతో పాటు యాక్సిడెంట్ స్పాట్‌లను గుర్తించామన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం మూలంగానే ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు కూడా విధిగా హెల్మెట్ పెట్టుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తుందన్నారు.

కొత్తగా 230 బస్సులు...

సిరిసిల్ల జిల్లాలో రూ.18 కోట్లతో డ్రైవర్ల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతీ జిల్లాలో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో డ్రైవర్ల శిక్షణ కేంద్రాన్ని నిర్మిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 96 డిపోల్లో బస్ స్టేషన్ల అభివృద్ధి కోసం ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ అభివృద్ధి నిధులు కేటాయించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాల కోసం 230 కొత్త బస్సులను కొనుగోలు చేయడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ.360 కోట్లతో 1400 బస్సులను కొనుగోళ్ల చేశామన్నారు.

రోజుకు 90 లక్షల మందికి సేవలు.

రాష్ట్రవ్యాప్తంగా 1200 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదన్నారు. కేవలం రోడ్డు సరిగా లేకపోవడం మూలంగానే ఈ గ్రామాలకు బస్సుల సౌకర్యం లేదని, వీటి మరమ్మతుల కోసం ప్రభుత్వం రవాణ శాఖకు రూ. 1000 కోట్లు కేటాయించదన్నారు. ఆర్టీసీ 21 జిల్లాల్లో నష్టాలతో నడుస్తున్నప్పటికీ నిత్యం ఆర్టీసీ నిత్యం రోజుకు 90 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు క్షేమంగా చేరవేస్తుందని, ఇందులో వరంగల్‌లో 10లక్షల మంది ప్రయాణికులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆమ్రపాలి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, ఆర్టీసీ ఈడీ సత్యనారాయణ, ఆర్ఎం సూర్యకిరణ్, కార్పొరేటర్ వీర భిక్షపతి, డీవీఎం రాములు, డిపో మేనేజర్లు భూపతిరెడ్డి, భానుకిరణ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నర్సంపేటలో...

నర్సంపేట : నర్సంపేట డిపోలో భద్రతావనం కార్యక్రమంలో భాగంగా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి మంగళవారం మొక్కలు నాటారు. అనంతరం రాజధాని బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 96 డిపోల నుంచి ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. రూ.60కోట్లతో రాష్ట్రంలోని ప్రతీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సివిల్ సప్లయీ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరిక మేరకు నర్సంపేట డిపో 10పల్లె వెలుగు బస్సులను కేటాయిస్తామని మంత్రి హామీనిచ్చారు. వరంగల్ రీజన్ పరిధిలోని 33 మంది డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. కాగా, నర్సంపేట ఆర్టీసీ డిపో ఆవరణలో భద్రత వనం కార్యక్రమంలో భాగంగా పెద్ది, రీజనల్ మేనేజర్ సూర్యకిరణ్ నర్సంపేట డిపో మేనేజర్ విజయరావు, కార్మికులతో కలిసి మంత్రి మొక్కలు నాటారు.

జనగామలో..

జనగామ, ఆంధ్రజ్యోతి: జనగామ జిల్లాలో మంగళవారం మంత్రి మహేందర్‌రెడ్డి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. పెంబర్తిలో రవాణ శాఖ యూనిట్ నూతన కార్యాలయ నిర్మాణం జరిగే ప్రదేశంలో శాసనమండలి విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. స్థానిక ప్రజాప్రతినిధుల కోరిక మేరకు పెంబర్తి వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సుల హాల్టింగ్‌కు మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆర్టీసీ డిపో ఆవరణలో శాసనమండలి విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే యాదగిరిరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ సంస్థ ద్వారా 1400 బస్సులు కొనుగోలు చేశామని, ఉమ్మడి వరంగల్ జిల్లాకు 120 కొత్త బస్సులు కేటాయించామన్నారు. కలెక్టర్ శ్రీదేవసేన, మునిసిపల్ చైర్‌పర్సన్ జి.ప్రేమలతారెడ్డి పాల్గొన్నారు.

అన్ని జిల్లా కేంద్రాల్లో పెనాల్టీ పాయింట్ల విధానం

రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి

మట్టెవాడ (వరంగల్): రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో వాహనాలకు పెనాల్టీ పాయింట్లు అమలు చేస్తామని రోడ్డు, రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో మంత్రి మహేందర్‌రెడ్డి హరితహారం కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ వాహనాలకు పెనాల్టీ పాయింట్ల విధానం మంగళవారం నుంచి హైదరాబాద్‌లో అమలులోకి వచ్చిందని, దీనిని రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కూడా అమలులోకి తెస్తామని చెప్పారు.

ఈ కొత్త విధానం వల్ల రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వాహనదారుడికి ముందు జరిమాన ఆ తర్వాత పాయింట్లను బట్టి చర్యలు ఉంటాయని చెప్పారు. వాహనదారుల్లో రహదారి భద్రత, క్రమశిక్షణ అలవరచడానికి ఈ పెనాల్టీ విధానం దోహదపడుతుందన్నారు. ఈ విధానం అమలుకు పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా సమన్వయంతో పని చేస్తాయన్నారు. రోడ్డు ఉన్న ప్రతీ గ్రామానికి బస్సులు నడుపనున్నట్లు చెప్పారు. రవాణాశాఖలోని సిబ్బంది కొరతను సీఎం దృష్టికి తీసుకువచ్చి త్వరలో ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు.

ఆకు పచ్చని తెలంగాణ కోసమే హరితహారం కార్యక్రమంలో భాగంగా రవాణాశాఖ కార్యాలయాలు, బస్ డిపోలలోని ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నట్లు మంత్రి మహేందర్‌రెడ్డి చెప్పారు. వరంగల్ రవాణశాఖ కార్యాలయంలో వాహనదారులకు ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు.



జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి

ఎంపీ దయాకర్, ఎమ్మెల్యే అరూరి రమేష్, డీటీసీ శివలింగయ్య, ఆర్టీవో వెంకారెడ్డి, ఖిలావరంగల్ తహసీల్దార్ సమ్మయ్య, ఆర్టీఏ మెంబర్ రాజు, రవాణ శాఖ అధికారులు రమేష్ రాథోడ్, కంచి వేణు, రవీందర్, వెంకటరమణ, అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుకు పుట్టిన రోజు వేడుక

చెట్టుకు పుట్టినరోజు పండుగచేసి పర్యావరణ పరిరక్షణలో తన బాధ్యతను చాటుకున్నాడు ములుగుకు చెందిన చుంచు రమేష్. స్థానిక తహసీల్దార్ కార్యాల య రోడ్డులోని ఆర్ఆర్ ఫొటోస్టూడియో, బట్టల దుకా ణం నడుపుతున్న రమేష్ హరితహారం కార్యక్రమంలో భాగంగా ఏడాది క్రితం తన షాపు ఎదుట మొక్కను నాటాడు. ప్రతీరోజు నీళ్లుపోస్తూ మొక్కను సంరక్షించాడు. ఈక్రమంలో ఏడాది తరువాత అది పెరిగి పెద్దదైంది. మంగళవారానికి సరిగ్గా మొక్కనాటి ఏడాది కావడంతో మిత్రులను ఆహ్వానించిన రమేష్ వారి సమక్షంలో చెట్టుకు మొదటి పుట్టినరోజు వేడుకలు జరిపారు. కేక్‌కూడా కట్‌చేయడంతో అందరూ చెట్టుకు శుభాకాంక్షలు చెప్పడంతోపాటు రమేష్ ఆలోచనను అభినందించారు.



-ములుగు

వివాహిత మృతదేహంతో రాస్తారోకో

పిల్లలకు న్యాయం చేయాలని బంధువుల డిమాండ్

ములుగు(జయశంకర్ జిల్లా) : భర్త చేతిలో బలైన బొంత సుమలత(26) మృతదేహంతో మంగళవారం ములుగులో జాతీయ రహదారిపై బంధువులు, మహిళా సంఘాల ప్రతినిధులు రాస్తారోకో చేశారు. ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని ములుగుకు తీసుకురాగా న్యాయం కోరుతూ మొదట సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎస్సై వెంకటేష్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. ఓ దశలో తీవ్ర ఆగ్రహానికి గురైన సుమలత బంధువులు పోలీసుల అదుపులో ఉన్న భర్త యాదయ్యను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. భార్యను హత్యచేయడంతో ఇద్దరు కుమార్తెలు అనాథలయ్యారని, వారి సంరక్షణను యాదయ్య చూస్తాడనే నమ్మకంలేదని పేర్కొన్నారు. అతడికి సంబంధించిన యావదాస్తిని పిల్లల పేరున రాసివ్వాలంటూ డిమాండ్ చేశారు. అక్కడినుంచి జాతీయ రహదారి వద్దకు వచ్చిన వారు మృతదేహంతో రాస్తారోకో చేశారు. దీంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. డీఎస్పీ దక్షిణామూర్తి రాస్తారోకో ప్రాంతానికి వచ్చి సుమలత బంధువులతో మాట్లాడారు. పిల్లలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.


ములుగులో మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు

స్కూల్ బ్యాగులో రక్తపింజర

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా) : కేసముద్రం మండలం కోమటిపల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న అజ్మీరా అఖిల స్కూల్ బ్యాగులో రక్తపింజర ప్రత్యక్షమైంది. ఆ గ్రామ శివారు చంద్రుతండాకు చెందిన అఖిల ఇంటి వద్ద నుంచి బ్యాగుతో సహ ఆటోలో స్కూల్‌కు వచ్చింది. ప్రార్థన అనంతరం మొదటి పీరియడ్‌లో వాటర్ బాటిల్ కోసమని బ్యాగును తెరిచింది. బ్యాగులో పాము ఉండడాన్ని గమనించిన విద్యార్థిని భయంతో ఏడ్చుకుంటూ ఉపాధ్యాయుడికి తెలిపింది. వెంటనే ఇరుగుపొరుగు వచ్చి బ్యాగులోంచి పామును వెలికి తీసి చంపేశారు. సదరు పామును గమనించగా విషపూరితమైన రక్తపింజరగా గుర్తించారు. పాము విద్యార్థిని ఇంటివద్దనే బ్యాగులో చేరిందని తెలుస్తోంది. ఏ చిన్న పొరపాటు జరిగినా విద్యార్థి ప్రాణాలకు అపాయం జరిగేదని వాపోయారు.


విద్యార్థిని బ్యాగులోంచి వెలికి తీసిన రక్తపింజర

సెప్టెంబర్ 10న కేయూ దూరవిద్య డిగ్రీ ప్రవేశ అర్హత పరీక్ష

కాళోజీ జంక్షన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ కోర్సులకు ప్రవేశ అర్హత పరీక్షను సెప్టెంబర్ 10న నిర్వహించనున్నట్లు కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ దినేష్‌కుమార్ తెలిపారు. ఏ విద్యార్హత లేకున్నా 2017- 6- 30 నాటికి 18 ఏళ్ళు నిండి ఉండాలన్నారు. దూరవిద్యలో డిగ్రీ చేయాలనుకునే ఆసక్తిగల వారు దరఖాస్తులను దూరవిద్య కేంద్రంలో, వివిధ జిల్లాల్లోని అధ్యయన కేంద్రాల్లో పొందాలన్నారు. దరఖాస్తులకు సెప్టెంబర్ 1 వరకు ఆఖరు తేదీ అని పేర్కొన్నారు.

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

రవాణ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ■ నగరంలో హోరెత్తిన ఆటో డ్రైవర్ల బహిరంగ సభ



బహిరంగ సభకు హాజరయిన ఆటో డ్రైవర్లు, ఇన్‌సెట్లో మంత్రి మహేందర్‌రెడ్డి

వరంగల్ అర్బన్ స్పోర్ట్స్ : తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆటో కార్మికుల పాత్ర మరువ లేనిదని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రవాణ శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ఆటో కార్మికుల సంక్షేమం కోసం రూ.52 కోట్ల ఆటో పన్ను రద్దు చేశారని గుర్తు చేస్తూ.. ఇళ్లు లేని ఆటో డ్రైవర్లకు డబుల్ బెడ్ రూంలు అందిస్తామన్నారు. ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా హన్మకొండలోని ఏనుగుల గడ్డ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఆటో డ్రైవర్ల బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బస్టాండ్లు, డిపోల సమీపంలో ఆటో స్టాండుల ఏర్పాటునకు కృషి చేస్తామని, ఆర్టీఏ, ఆర్టీసీ అధికారుల వేధింపులు ఆటోవాలాలకు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆటో కార్మికులు గౌరవప్రదంగా జీవనం కొనసాగిస్తూ వారి పిల్లలను డాక్టర్లుగా, ఐఏఎస్‌లుగా తీర్చి దిద్దడం అభినందనీయమన్నారు.

వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలకు భిన్నంగా ఆటో కార్మికులు తమవంతు పాత్ర పోషించారన్నారు. ఆటో కార్మికుల కోసం తనవంతు సహాయసహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకూ ఆటో కార్మికుల వెంట ఉంటానని వారి కష్టసుఖాల్లో పాలుపంచకుంటానని హామీ ఇచ్చారు. ఆటో కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. ఇన్సూరెన్స్ కంపెనీలతో మంత్రులు మాట్లాడి ఆటో డ్రైవర్లకు ఆటోలపైన ఇన్సూరెన్స్‌ను తగ్గించేలా చర్యల తీసుకోవాలని కోరారు. ఆటో కార్మికులపై ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల వేధింపులు మితిమీరుతున్నాయని త్వరలోనే వాటి భరతం పడతామని హెచ్చరించారు. ఆటో కార్మికులకు ఆసరాగా ఉండేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు అందించాలని సీఎంని కోరతామని తెలిపారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ ఆటో కార్మికుల బాధలు పోవాలంటే ప్రత్యేక కార్పొరేషన్ అవసరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆటో కార్మికుల పాత్ర మరువలేనిదన్నారు. ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ ఆటో కార్మికులపై వడ్డీ వ్యాపారుల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయన్నారు. ఆటో కార్మికులకు బ్యాంకుల ద్వారా ఆటోలు ఇప్పించేలా ప్రయత్నం చేస్తామన్నారు.

సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టాడు) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమానికి రూ.1000 కోట్లతో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో రిక్షాలకు ఇన్సూరెన్స్‌పై 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది ఆటోలపైనే జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రైవేటు ఫైనాన్స్‌ల దోపిడీని అరికట్టాలని, ఆటోలు సీజ్ చేయకుండా చూడాలని, ఆటోలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలకు గురన ఆటో కార్మికుల వైద్యం కోసం విరాళాలు సేకరించి రూ.43వేలు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 11 అంశాలతో కూడిన డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

ఈ సందర్భంగా ఇటీవల సివిల్స్ ర్యాంక్ సాధించిన హసన్‌పర్తికి చెందిన ఆటో డ్రైవర్ చెన్నూరి రమణయ్య కుమారుడు రూపేష్‌ను మంత్రి మహేందర్ రెడ్డి సన్మానించారు. అదే విధంగా పెద్దమ్మగడ్డకు చెందిన ఆటో డ్రైవర్ సారంగపాణి కుమార్తె నవ్యను సన్మానించారు. 14 మంది ఉత్తమ ఆటో డ్రైవర్లకు వెయ్యి రూపాయల చొప్పున నగదు పారితోషకంతో పాటు జ్ఞాపికలు అందించి సన్మానించారు. వరంగల్ జిల్లాలో ఏకైక ఆటో డ్రైవర్ లక్ష్మిని కూడా మంత్రి సన్మానించారు.

కార్యక్రమంలో ఇంకా 'కుడా' చైర్మన్ మర్రి యాదవరెడ్డి, గొర్రెల పెంపకం దారుల సహకార సంస్థ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సంస్థ చైర్మన్ చాడ వాసుదేవారెడ్డి, కార్పొరేటర్లు వీరగంటి రవీందర్, జ్యోతి పరమేష్, టాడు యూనియన్ జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్, అర్బన్ జిల్లా ప్రధాన అధ్యక్షుడు మంద శ్రీధర్‌రెడ్డి, రూరల్ జిల్లా కార్యదర్శి గౌనిరాజు, రమేష్, చీకటికుమార్, ఈసంపల్లి సంజీవ, మడికొండ బాబు, కుమార్, రాజు, మంచాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





ఉత్తమ ఆటోడ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం, సివిల్స్ సాధించిన రూపేష్‌ను అభినందిస్తున్న మంత్రి

కోర్టు కేసుతో సంబంధం లేదు

ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ నేత ఇనుగాల శ్రీధర్




మాట్లాడుతున్న ఇనుగాల శ్రీధర్

రెవెన్యూ కాలనీ(హన్మకొండ): విలీనమైన ఉద్యోగుల కోర్టు కేసు విషయంలో కాంగ్రెస్ పార్టీకి, ఐఎన్‌టీయూసీకి ఎటువంటి సంబంధం లేదని ఆ కేసు ఎవరు వేశారో తమకు తెలియదని 327 యూనియన్ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. హన్మకొండ నక్కలగుట్టలోని విద్యుత్ గెస్ట్ హౌస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ కావాలనే కొందరు తమ యూనియన్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విలీనం కోసం 327 ఆధ్వర్యంలో అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించామని గుర్తు చేశారు. అలాంటి యూనియన్‌పై కావాలనే కొందరు పనిగట్టుకొని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఒక చానల్లో కోర్టు వేసింది కాంగ్రెస్ పార్టీ అని తప్పుడు ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన కార్యక్రమాలకు కాంగ్రెస్ నాయకులు వచ్చి మద్దతు తెలిపాయన్నారు. అలాంటి సంఘాలపై బురదజల్లే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. కార్మికులను విచ్ఛిన్నం చేయాలనే కుట్రతోనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని కార్మిక సంఘాలు పనిగట్టుకొని ఆరోపణలు చేస్తున్నాయని అలాంటి ఆరోపణలు మానుకోవాలన్నారు.

ఐఎన్‌టీయూసీ అనుబంధ 327 యూనియన్ కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించి కార్మికుల హక్కులను సాధించిందని గుర్తు చేశారు. జాతీయ అధ్యక్షుడు సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నో కార్మిక హక్కులను సాధించామన్నారు. విలీనమైన ఉద్యోగుల పక్షాన నిలబడి వారి సమస్యలపై 327 యూనియన్ కృషి చేస్తోందని శ్రీధర్ తెలిపారు.

రీజనల్ సెన్సార్ బోర్డు మెంబర్‌గా దొంతు రమేష్



వరంగల్ అర్బన్ అగ్రికల్చర్: రీజనల్ సెన్సార్ బోర్డు మెంబర్‌గా దొంతు రమేష్ నియామకమయ్యారు. ఈ మేరకు భారత ప్రభుత్వ సమాచార ప్రసార శాఖ మంత్రిత్వ శాఖ కార్యదర్శి పీకే ఝా నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ జర్నలిస్టు అయిన దొంతు రమేష్ ఉమ్మడి వరంగల్ జిల్లాకు సుపరిచితుడే. జర్నలిస్టు కోటాలో భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ ప్రాంతీయ సెన్సార్ బోర్డు అడ్వైజరీ మెం బర్‌గా నియామకమయ్యారు. ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 24 ఏళ్లుగా జర్నలిస్టుగా సేవలందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన టీవీ 9 ఛానల్‌కు సీనియర్ ప్రిన్సిపల్ కరస్పాండెంట్‌గా వరంగల్ కేంద్రంగా పని చేస్తున్నారు. సెన్సార్ బోర్డు మెంబర్‌గా నియామకమైన ఆయన హైదరాబాద్ కేంద్రంగా తెలుగు సినిమాల సెన్సార్ విధానంలో పాల్గొంటారు.

విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విలీనంపై హైకోర్టులో కేసు వేయడంపై నిరసన

ప్రధాన రహదారిపై రాస్తారోకో.. ర్యాలీ



విద్యుత్ భవన్ ఎదుట మహాధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

రెవెన్యూ కాలనీ(హన్మకొండ): విద్యుత్ సంస్థల్లో విలీనమైన ఉద్యోగుల అంశంపై హైకోర్టులో కొందరు రిట్ పిటిషన్ వేశారని ఆరోపిస్తూ మంగళవారం హన్మకొండ విద్యుత్ భవన్ ఎదుట విలీనమైన విద్యుత్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. గంటపాటు రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించి అర్బన్ కలెక్టర్ అమ్రపాలి కాటాకు వినతిపత్రాన్ని అందించారు.

ఈ సందర్భంగా టీఆర్‌వీకేఎస్ ఎన్పీడీసీఎల్ అధ్యక్ష కార్యదర్శు లు ఉదయభాస్కర్, బండారి ప్రభాకర్, ప్రాం తీయ అధ్యక్షుడు గులామ్ రబ్బానీ మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను సుమారు 21 వేల మందిని విలీనం చేస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. కొంత మంది బయటి వ్యక్తులు కొన్ని కార్మిక సంఘాల ముసుగులో హై కోర్టులో కేసు వేశారని ఆరోపించారు.

గత 25 సంవత్సరాలుగా సంస్థను నమ్ముకొని చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న ఉద్యోగులు రెగ్యులర్ అయిన సంతోషం కూడా లేకుండా చేశారని, నోటికి వచ్చిన ముద్దను లాక్కొనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్మికుల పొట్టను కోర్టుల్లో కేసు వేసి అడ్డుకోవద్దన్నారు. 1104 యూనియన్ కంపెనీ సెక్రెటరీ ఎ.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కొంత మంది విలీనమైన ఉద్యోగుల నోటి కాడి ముద్దను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలను పాల్పడవద్దన్నారు.

కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు తిరుపతిరెడ్డి, సామ్యానాయక్, విజేందర్ రెడ్డి, సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, విలీనమైన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, విద్యుత్ భవన్ ఎదుట మహాధర్నా సందర్భంగా రెండు కార్మికుల సంఘాల నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణ సందర్భంగా ఒకరికొకరు నెట్టుకుంటుపోయారు. సుబేదారి పోలీసులు వచ్చి ఘర్షణ పడుతున్న కార్మిక సంఘాల నాయకుల ఘర్షణను సద్దుమనిగించారు.

నోటికాడ ముద్దను లాక్కొనే ప్రయత్నం

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విలీనం చేశారని కొందరు కావాలని కోర్టుల్లో కేసు వేసి నోటి కాడి ముద్దను లాక్కొనే ప్రయత్నం చేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. అమరవీరుల స్థూపం వద్ద విద్యుత్ ఉద్యోగుల ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడ లేని విధంగా సుమారు 21 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విలీనం చేశారన్నారు. విద్యుత్ ఉద్యోగుల జీవితాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ వెలుగులు నింపితే ఒక రాజకీయ పార్టీకి చెందిన నాయకులు కేసులు వేసి వారి జీవితాల్లో చీకటి నింపేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు.

భూసమస్యలు పరిష్కరించుకోవాలి

జాయింట్ కలెక్టర్ వనజాదేవి



కేశిరెడ్డిపల్లిలో రెవెన్యూ శిబిరంలో మాట్లాడుతున్న జేసీ వనజాదేవి

బచ్చన్నపేట: రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకునేందుకు గ్రామాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ వనజాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని కేశిరెడ్డిపల్లి గ్రామంలో రెండో రోజు భూ రికార్డుల సవరణకు సంబంధించి కొనసాగుతున్న శిబిరానికి జేసీ హాజరై పరిశీలించారు. పహణీలు, 1బీలు, మ్యుటేషన్‌లు, ఇతర సమస్యలను పరిష్కరించుకునేందుకు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడకూడదనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గ్రామానికి అధికారులు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉంటూ తమ సమస్యలను చెప్పుకుని పరిష్కరించుకోవాలన్నారు. వివాదాలకు సంబంధించిన కేసులను పరిగణలోకి తీసుకోవటం జరగదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, ఎంఆర్ఐ షాకీర్, వివిధ గ్రామాల వీఆర్‌వోలు పాల్గొన్నారు.

జిల్లా ఎక్సైజ్ కార్యాలయాన్ని ప్రారంభించిన సూపరింటెండెంట్



నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మహిపాల్‌రెడ్డి

జనగామ రూరల్ : గతంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా కార్యాలయం మండలంలోని పెంబర్తి ప్రగతి భవన్‌లో ఉండగా కలెక్టర్ ఆదేశాల మేరకు చీటకోడూర్ రిజర్వాయర్ గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్ స్టాఫ్ క్వాటర్స్‌లోకి సోమవారం మార్చారు. క్వాటర్ నెం. ఈ5ను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని సూపరింటెండెంట్ ఆర్.మహిపాల్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం కార్యాలయం చిరునామా మార్చామన్నారు. లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకునేవారు ఇక్కడికి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ శేషగిరిరావు, ఎస్సై పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి

డీఈవో యాదయ్య ● ఘన్‌పూర్ బాలికల హైస్కూల్లో 'త్రీఆర్స్' ప్రారంభం



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న డీఈవో యాదయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు, గణితం, ఇంగ్లీష్ (త్రీఆర్స్)లో వెనుకబడిన విద్యార్థులను 60 రోజుల్లో ప్రగతిలోకి తీసుకువచ్చే అభ్యసనాభివృద్ధి పథకంను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యూలర్ సిలబస్‌తో పాటు తెలుగు, ఇంగ్లీష్, గణితంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణకుమారి ఏఎంవో శ్రీనివాస్‌రావు, ఎంఈవో లక్ష్మయ్య, పీఎస్ హెచ్‌ఎం రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉన్న ఎమ్మార్సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు కలిగివున్న విద్యార్థులకు ఇచ్చే శిక్షణను పరిశీలించి శిక్షకులు,విద్యార్థులను అభినందించారు.

'కస్తూర్బా' సందర్శన...

మండలంలోని నమిలిగొండ శివారులోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలను మంగళవారం సాయంత్రం డీఈవో ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఎంవో శ్రీనివాస్, ఎంఈవో లక్ష్మయ్య తదితరులున్నారు.

యూపీఎస్ నమిలిగొండలో...

త్రీఆర్స్ కార్యక్రమం మంగళవారం యూపీఎస్ నమిలిగొండలో ప్రారంభమైంది. విద్యార్థులకు కనీస సామర్థ్యాలు బోధించడానికి 3 నుంచి 7 తరగతులను 6 గ్రూపులుగా విభజించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రమేశ్, ఉపాధ్యాయులు వి.మురళీధర్, వై.రమేశ్, బి.సారంగపాణి, పద్మ, శోభారాణి పాల్గొన్నారు.

శివునిపల్లి హైస్కూల్‌లో...

స్థానిక శివునిపల్లిలో త్రీ ఆర్స్ కార్యక్రమం కోసం సామర్థ్యాలు వచ్చిన వారు, రాని వారిని బేస్‌లైన్ పరీక్ష ద్వారా గుర్తించి గ్రూపులుగా విభజించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ, సీఆర్‌పీ పి.వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మన్‌పహాడ్ యూపీఎస్‌లో...

దేవరుప్పుల: మండలంలోని మన్‌పహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం డీఈవో యాదయ్య తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల సంఖ్యను హెడ్మాస్టర్ రాపాక లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకుని విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలించారు.

రఘునాథపల్లిలో...

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని విద్యవనరుల కేంద్రాన్ని జనగామ డీఈవో యాదయ్య మంగళవారం సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంఈవో జయసాగర్, హైస్కూల్ హెచ్‌ఎం సంపత్, సమ్మయ్య, ఉమాపతి, మల్లిఖార్జున్, సీఆర్‌పీలు శ్రీనివాస్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్‌డీవో కార్యాలయం ముట్టడికి యత్నం



ఏబీవీపీ నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో

జనగామ ఎడ్యుకేషన్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం జనగామ ఆర్‌డీవో కార్యాలయాన్ని ముట్టడకి యత్నించేందుకు వందలాది మంది విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈసందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణిని వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. విద్యార్థుల ఉపకారవేతనాలు, హాస్టల్ ఫీజులను, మెస్‌చార్జీలను మూడు రెట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాజు, మధు, అభినయ్, నాగరాజు, పవన్, అనిల్ పాల్గొన్నారు

నర్మెటలో...

నర్మెట: కేజీ టూ పీజీ ఉచిత నిర్బంధ విద్యను వెంటనే అమలు చేయాలని కోరుతూ మంగళవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీపతి వెంకటేష్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఏబీవీపీ మండల కన్వీనర్ దేవసాని శ్రీకాంత్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 1700 వందల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థుల కోసం పోరాడే విద్యార్థి సంఘాల పైన 30 యాక్టు పెట్టి అక్రమంగా క్రిమినల్ కేసులు పెట్టడం ఈప్రభుత్వం వెంటనే మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శేఖర్, క్రిష్ణ, దినేష్, గణేష్, అనిల్, రాజు, శ్రీనివాస్, రజినికాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూపోరాటాల్ని కొనసాగిస్తాం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకట్రాజం



నీర్మాలలో కాచం కృష్ణమూర్తి స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దేవరుప్పుల: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు కాచం కృష్ణమూర్తి స్ఫూర్తిగా భూపోరాటాలను కొనసాగిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏదునూరి వెంకట్రాజం అన్నారు. కృష్ణమూర్తి స్వగ్రామమైన నీర్మాలలో ఆయన 11వ వర్ధంతిని పురస్కరించుకొని మండల సీపీఎం ఆధ్వర్యంలో ఆయన స్మారకస్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రాజం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటయోధులు తనకు స్ఫూర్తి అని, కమ్యూనిస్టుల ఎజెండానే తన ఎజెండా అని మాట్లాడిన ముఖ్యమంత్రి కేసీఆర్ నైజాంలను కీర్తిస్తూ పెట్టుబడి దారులు, పెత్తందార్లకే వత్తాసు పలుకుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సింగారపు రమేష్, రైతు సంఘం మండల కార్యదర్శి చొప్పరి బాలస్వామి, సీఐటీయూ మండల కార్యదర్శి పయ్యావుల భిక్షపతి, కాసర్ల మాధవరెడ్డి, పొదల విష్ణు, సింగారపు అయోధ్య, నల్ల మల్లయ్య, ఎండీ సైదులు, వడ్లకొండ సత్తయ్య, ఎడమ రాంరెడ్డి, సింగారపు అశోక్, షాబద్దీన్ పాల్గొన్నారు.

ఎన్‌సీడీ స్క్రీనింగ్ సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలి

రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ జనార్దన్



పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న ఎన్‌సీడీ రాష్ట్రపరిశీలకుడు

కొడకండ్ల : ఎన్‌సీడీ స్క్రీనింగ్ సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని ఎన్‌సీడీ రాష్ట్రపరిశీలకుడు డాక్టర్ ఎం.జనార్దన్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. మండలంలో జరుగుతున్న ఎన్‌సీడీ స్క్రీనింగ్‌ను పరిశీలించడానికి పీహెచ్‌సీకి వచ్చిన ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో ఉన్న 31840 మంది జనాభాలో 30 సంవత్సరాలకు పైబడి 65 సంవత్సరాలలోపు ఉన్నవారిలో 12039 మందికి ఎన్‌సీడీ స్క్రీనింగ్ చేయాల్సి ఉండగా, సిబ్బంది కొరత వల్ల ఇప్పటివరకు అందులో పదిశాతమే 1239 మందికి మాత్రమే స్క్రీనింగ్ జరిగిందనీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 30లోగా స్క్రీనింగ్ పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కె. భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమంలా హరితహారం

● 40 నిమిషాల్లో 2500 మొక్కలు నాటేందుకు సన్నాహాలు

రఘునాథపల్లి రూరల్ : హరితహారాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకుపోవడానికి గాను ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని ట్రాన్స్‌కో డీఈ రాబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఆయన విలేకరుతో మాట్లాడుతూ 3న స్థానిక సబ్‌స్టేషన్‌లో పెద్ద ఎత్తున హరితహారం కార్యక్రమాన్ని నిర్వహినున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల స్థాయి విధ్యార్థులకు వ్యాసరచన, వకృత్వం పోటీలను 2న నిర్వహిస్తామన్నారు.

అలాగే జిల్లాలోని ట్రాన్స్‌కో ఉద్యోగులంతా ఏకకాలంలో హరితహారంలో పాల్గొని కేవలం 40 నిమిషాల్లోనే 2500 మొక్కలను నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. 3న నిర్వహించే హరితహారం కార్యక్రమానికి కలెక్టర్ శ్రీదేవసేన, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక ఏఈ తూరుగొండ శంకరయ్య, జనగామ ఏఈ కనకయ్య, సిబ్బంది లాలు, స్వామిదాసు, పరుషరాములు తదితరులు ఉన్నారు.

ఓడీఎఫ్ లక్ష్యం కనుమరుగు

నత్తనడకన మరుగుదొడ్ల నిర్మాణం

గడువు ముంచుకొస్తున్నా అధికారులను వదలని మొద్దునిద్ర • ఆగస్టు 10లోగా పనులు పూర్తవడం కష్టమే..

బిల్లుల మంజూరులో జాప్యంతో పలుచోట్ల అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు

ఒకటికి, రెండుకు ఆరుబయటికి వెళ్లే పరిస్థితులు ఎక్కడో కుగ్రామాల్లో కాదు.. నగరాలు, పట్టణాల్లోనూ నేటికీ కనిపిస్తున్నాయి.. వాస్తవానికి ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పు వస్తేనే ఎక్కడపడితే అక్కడ మల,మూత్ర విసర్జన జరగదు. అంతే కాదు నగరాల్లోని ప్రధాన కూడళ్లలో మరిన్ని సులభ్ కాంప్లెక్సుల నిర్మాణం జరగాలి. ప్రధానంగా ప్రతీ ఇంట్లో ఒక మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలి.. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన విధంగా 2018 అక్టోబర్ 2 నాటికి స్వచ్ఛ తెలంగాణ సాధించుకోగలం. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ పథకాల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల్లో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత(ఓడీఎఫ్) స్కీంను అమలుచేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పథకంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పరిస్థితిపై పరిశీలనాత్మక కథనం.





MAHABUBABAD

నత్తనడకన మరుగుదొడ్ల నిర్మాణ పనులు



మహబూబాబాద్‌లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జేసీ, ఆర్డీవో(ఫైల్)

ఆంధ్రజ్యోతి, మహబూబాబాద్

మానుకోట జిల్లాలోని ఏకైక మున్సిపాల్టీతో పాటు 231 గ్రామపంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణాలపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. ఓడీఎఫ్ పథకంలో భాగంగా జిల్లాలో మరుగుదొడ్లు నిర్మిస్తున్నపట్టికి వేగవంతంగా కొనసాగక బిల్లుల చెల్లింపుల జాప్యమో లేకా అధికారుల నిర్లక్షమో.... ఇతరత్రా కారణలతో నత్తనడకన పనులు సాగుతున్నాయి. దీంతో మరుగుదొడ్ల నిర్మాణంలో వెనుకబడిందని చెప్పవచ్చు. ఈ విషయం పై జిల్లా కలెక్టర్ ప్రీతీమీనా సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. ఇటీవల సమీక్షలో కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లాలో 57,795 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరీ కాగా అందులో కేవలం 19,811 మాత్రమే నిర్మాణాలు పూర్తికాగా, 14796 మరుగుదొడ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా 23,658 మరుగుదొడ్లను ప్రారంభించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. మానుకోట పట్టణంలో 2905 గృహాలకు మరుగుదొడ్లు లేవని అధికారులు గుర్తించారు. వారందరు నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు చేపడుతున్నారు. అందులో ఇప్పటికే 1249 పూర్తి అయ్యాయి. 983 బెసిమెంట్, ఓడల స్టేజీ వరకు నిర్మాణాలు జరిగి, మొదటి దఫా బిల్లులు అందాయి. ఇక మిగిలిన 711 మరుగుదొడ్ల నిర్మాణాలు కూడా మొదలు పెట్టారు.

ఓడీఎఫ్ అంటే..



వరంగల్ సిటీ : ఓడీఎఫ్ అంటే ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ(బహిరంగ మల, మూత్ర విసర్జనరహితం) అని అర్థం. 'స్వచ్ఛభారత్' సాకారానికి కృషిచేసేందుకు 2015లో కేంద్ర ప్రభుత్వం ఓడీఎఫ్ పథకాన్ని ప్రారంభించింది. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'స్వచ్ఛభారత్' కార్యక్రమంలో భాగంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండాలనేది ఈ పథకం ముఖ్య ఉద్దేశం. బహిరంగ మల, మూత్ర విసర్జన ద్వారా ప్రజారోగ్యానికి హాని కలుగుతుంది. ఈ కారణంతో ముఖ్యంగా ఐదేళ్లలోపు చిన్నారులు వివిధ వ్యాధుల బారినపడి మృతి చెందుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది.. సెప్టిక్ ట్యాంక్ లేని మరుగుదొడ్ల మురుగు నేరుగా డ్రైనేజీల్లో కలువడం వల్ల పర్యావరణ పరిరక్షణకు భంగం కలుగుతుంటుంది. ఈ సమస్యను నివారించడమే ఓడీఎఫ్ కీలక లక్ష్యం. ఈ పథకం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నాయి. రాష్ట్రంలో పురపాలక శాఖ స్కీంను పర్యవేక్షిస్తుంది. కేంద్ర సహకారంతో మొత్తంగా వ్యక్తిగత మరుగుదొడ్డికి రెండు దశల్లో మొత్తం రూ.12 వేలను అందిస్తారు. ఆగస్టు 10 నాటికి రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలతో ఓడీఎఫ్ లక్ష్యాలు పూర్తి చేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఆగస్టు 15న ఓడీఎఫ్ నగరాల ప్రకటన జరుగనుంది.

JAYASHANKAR

ఇంకా ఆరు బయటకే...!



భూపాలపల్లిలో పూర్తికాని మరుగుదొడ్డి

భూపాలపల్లి టౌన్ (జయశంకర్ జిల్లా)

ఓడీఎఫ్ లక్ష్యానికి దూరంగా నిలుస్తోంది భూపాలపల్లి నగరపంచాయతీ. దీని పరిధిలో 20వార్డులు ఉండగా 32కాలనీలు ఉన్నాయి. ఓడీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేయగా అన్ని కాలనీల నుంచి మొత్తంగా 1687దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇందులో 1636మాత్రమే నగరపంచాయతీ కమిషనర్ మంజూరు చేశారు. ఇంకా 12మంది అసలే మొదలు పెట్టలేదు. మొత్తంగా 461 మరుగుదొడ్లు పూర్తి కావాల్సి ఉంది. అయితే బిల్లుల విషయంలోను ఇబ్బందులు తప్పడం లేదు. జియోట్యాగింగ్ ద్వారా మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నప్పటికీ కొందరికి రూ.6వేల వరకే బిల్లులు వచ్చినట్లు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

3600 మరుగుదొడ్ల నిర్మాణ పరిస్థితి ఏంటీ..?

భూపాలపల్లి నగరపంచాయతీ పరిధిలో సాధారణ జనాభా కలిగిన ఇళ్లలో ఇంకా 3600మంది మరుగుదొడ్లు నిర్మించుకోవాల్సి ఉందని సిబ్బంది అంచనా. ఇవి ఎక్కువగా నగరపంచాయతీ పరిధిలోని హనుమాన్‌నగర్, శాంతినగర్, కాకతీయకాలనీ, ఆకుదారివాడ, సెగ్గంపల్లి, గడ్డిగానిపల్లి, కాశీంపల్లి, జంగేడు,పుల్లూరిరామయ్యపల్లి, కుందూరుపల్లి, మహబూబ్‌పల్లి, రాజీవ్‌నగర్, వేశాలపల్లి తదితర కాలనీలు ఉన్నాయి.

భూపాలపల్లి నగర పంచాయతీలో మరుగుదొడ్ల నిర్మాణం ఇలా..

జనాభా :	59,752
ఇళ్లు:	14,260
ఓడీఎఫ్ ద్వారా మంజూరైన మరుగుదొడ్లు :	1636
నిర్మాణం పూర్తయినవి:	1072
బేస్‌మెంట్ దశలో ఉన్నవి:	308
ముగ్గుపోసి వదిలేసినవి:	141
పనులు మొదలుకానివి:	108
శానిటరీ మరుగుదొడ్లు:	7

15 రోజుల్లో నిర్మాణ పనులు పూర్తిచేయిస్తాం

మంజూరైన మరుగుదొడ్లలో పూర్తి కాని వాటిని 15 రోజుల్లో పూర్తి చేస్తాం. ఇప్పటివరకు పనులు ప్రారంభించని వారితో మాట్లాడి వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కాంట్రాక్టర్‌కు అప్పగిస్తాం. ఈ క్రమంలో మిగిలిన మరుగుదొడ్లు పూర్తి చేస్తాం.

- రవీందర్, నగరపంచాయతీ కమిషనర్, భూపాలపల్లి



నర్సంపేట టీఆర్ఎస్ కాలనీలో పూర్తయిన సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం

JANAGAON

గడువులోగా ఓడీఎఫ్ పట్టణం అనుమానమే ?

ఆంధ్రజ్యోతి, జనగామ

"ఈనెల 15లోగా జనగామ మునిసిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా చర్యలు తీసుకోవాలి" అని ఇటీవల మునిసిపల్ శాఖ సమీక్ష సమావేశంలో మంత్రి కేటీఆర్ జిల్లా అధికారులకు సూచించారు. అయితే పథకం అమలు నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.2.26 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటికే 300 మంది లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. మిగితా చోట్లలో పనులు జరిగినా.. బిల్లులు మంజూరు కాలేదు. ఓడీఎఫ్ లక్ష్యంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేసేందుకు మరో 20 రోజుల గడువే ఉంది. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను జనగామ మునిసిపాలిటీ పరిధిలో వార్డు కౌన్సిలర్లకు అప్పగించారు. ఈ క్రమంలో పాత వాటినే కొత్తగా నిర్మించినట్లుగా చూపించి, కొందరు కౌన్సిలర్లు నిధులు గుటుక్కు అనిపించారనే ఆరోపణలు ఉన్నాయి.

7 నెలలుగా పడకేసిన పథకం..

వాస్తవానికి గత ఏడు నెలలుగా జనగామ పురపాలిక పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణ పథకం అమలు పడకేసింది. ఇప్పటికే మరుగుదొడ్డి కట్టుకున్న వారికే అందని బిల్లులు.. తమకు మాత్రం తొందరగా ఎలా వస్తాయి? అనే ప్రశ్న ఎదురవడంతో ఇతరులు ఓడీఎఫ్‌ను సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఈనేపథ్యంలో జనగామలోని పలు వార్డుల్లో నేటికీ మరుగుదొడ్ల నుంచి నేరుగా కాల్వల్లోకి మలాన్ని వదిలే పరిస్థితులే కొనసాగుతున్నాయి. పట్టణంలో మొత్తం 28 వార్డుల్లో పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. కాగా, 14 మంది అధికారులను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి ఈ నెల 30లోగా 7 వార్డులను ఓడీఎఫ్‌లుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తామని జనగామ మునిసిపల్ కమిషనర్ ఈశ్వరయ్య తెలిపారు.



బిల్లులందక అసంపూర్తిగా ఆగిపోయిన మరుగుదొడ్డి నిర్మాణ పనులు

WARANGAL URBAN

14,063 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి

వరంగల్ సిటీ (వరంగల్ అర్బన్ జిల్లా)

వరంగల్ మహానగరాన్ని బహిరంగ మల, మూత్ర విసర్జన లేని నగరంగా ఆగస్టు 10 నాటికి మార్చేందుకు బల్దియా కృషి చేస్తోంది. ఫిబ్రవరి మాసానికే లక్ష్యాలు పూర్తి కావాల్సి ఉండగా బల్దియా చేధించలేకపోయింది. అంతే కాదు ఉగాదికి విధించుకున్న మరో టార్గెట్‌ను కూడా పూర్తి చేయలేకపోయింది. బల్దియా వైఫల్యంపై మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. రెండు సార్లు హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆగస్టు 10 నాటికి చివరి డెడ్‌లైన్‌గా విధించారు. అంతే కాదు ఓడీఎఫ్ లక్ష్యాలు పూర్తి చేయని పక్షంలో మహానగరానికి అభివృద్ధి నిధులు నిలిపివేస్తామని స్పష్టం చేశారు. దీంతో బల్దియా అధికారులు మళ్లీ ఓడీఎఫ్ లక్ష్యాల పూర్తికి కసరత్తు చేసి ఆ మేరకు నిర్మాణాలను పూర్తి చేసే దిశగా సాగుతున్నారు.

17,824 దరఖాస్తులు..

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం 17824 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో ఇప్పటికి 14063 మరుగుదొడ్ల నిర్మాణాలు జరిగాయి. ఇంకా 3761వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు జరగాల్సి ఉంది. 50 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు రూ.5 లక్షల నామినేషన్ పనుల నజరానాను ఇటీవలే మేయర్ నన్నపునేని నరేందర్ ప్రకటించారు. దీంతో కాంట్రాక్టర్లు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల వేగాన్ని పెంచారు. ఈ నెల 28వ తేదీ నుంచి మూడు రోజుల వ్యవధిలో నాలుగు వేల వరకు నిర్మాణాలు జరగడమే ఇందుకు నిదర్శనం.

ఇన్‌సానిటరీ టాయిలెట్లే సవాల్

ఇక ఇన్‌సానిటరీ టాయిలెట్లు ఆరు వేలకు పైగానే ఉన్నాయి. వీటన్నింటికి బల్దియా అధికారులు నోటీసులు జారీ చేశారు. ఓడీఎఫ్‌గా వరంగల్ ప్రకటితం కావాలంటే ఇన్‌సానిటరీ లక్ష్యాలు కూడా పూర్తవ్వాల్సి ఉంది. ఈ దశలో వ్యక్తిగత మరుగుదొడ్ల కంటే ఇన్‌సానిటరీ లక్ష్యాలే బల్దియాకు సవాల్‌గా మారాయి. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల లక్ష్యం పూర్తి అయినా వరంగల్ నగరం ఓడీఎఫ్‌గా ప్రకటితం అయ్యే అవకాశం లేదు. ఇన్‌సానిటరీ లక్ష్యాలు కూడా పూర్తవ్వాల్సి ఉంది. నోటీసులు జారీ చేసినా కొందరు యజమానులు స్పందించడం లేదు. ఈ క్రమంలో వీరిపై కఠిన చర్యలకు బల్దియా సిద్ధమవుతోంది. విద్యుత్, నీటి సరఫరా కూడా బంద్ చేస్తామని ఇప్పటికే ప్రకటించిన క్రమంలో ఆ దిశగా చర్యలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఎలాగైనా లక్ష్యాలు సాధించి మంత్రి కేటీఆర్ దృష్టిలో ఉన్న అసంతృప్తిని చెరిపివేయాలనే సంకల్పంతో మేయర్ నన్నపునేని నరేందర్, కమిషనర్ శృతి ఓఝాలు నిర్మాణాల లక్ష్యాల పూర్తికి కృషి చేస్తున్నారు.



వ్యక్తిగత మరుగుదొడ్డి

లక్ష్యం ఛేదించిన నర్సంపేట

నర్సంపేట(వరంగల్ రూరల్ జిల్లా)

వరంగల్ రూరల్ జిల్లాలోని నర్సంపేట(నగర పంచాయతీ) ఓడీఎఫ్ దిశగా అడుగులు వేస్తోంది. వందశాతం పూర్తయిన మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బృందాలు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపడంతో కేంద్ర ప్రభుత్వం నర్సంపేటను ఓడీఎఫ్ సిటీగా ప్రకటించింది. వచ్చే ఆగస్టు 15న ఓడీఎఫ్ సర్టిఫికెట్‌ను నగర పంచాయతీ కమిషనర్, చైర్మన్‌లకు అందజేయనుంది. జిల్లాలోని 14మండలాల్లో 279గ్రామపంచాయతీలు, నర్సంపేట, పరకాలలో నగర పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 172 పంచాయతీలో పాటు నర్సంపేట, పరకాల నగర పంచాయతీలకు 29500 వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో నర్సంపేట పట్టణానికి 1516 మరుగుదొడ్లను కేటాయించింది. మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలు వెంటవెంటనే పూర్తి చేయించడానికి జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్‌తో పాటు డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, ఇతర అధికారులు, నర్సంపేట కమిషనర్‌తో కలిసి గ్రామసభలు నిర్వహించి ప్రజలను చైతన్య పర్చారు. నిర్మానాలు సకాలంలో పూర్తిచేయించారు.



బహిరంగ మలవిసర్జనకు పాల్పడితే రూ.500జరిమాన అని గోడపై రాయించిన పేయింటింగ్ దృశ్యం

77 దరఖాస్తుల తిరస్కరణ

నర్సంపేటకు మరుగుదొడ్లు మంజూరైన విషయం తెలుసుకున్న పట్టణంలోని 20వార్డులకు చెందిన 1728మంది మరుగుదొడ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో మరుగుదొడ్లు ఉండి మళ్లీ దరఖాస్తు చేసుకున్న 77మంది దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. మిగిలిన 1516మరుగుదొడ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసి నర్సంపేట ఓడీఎఫ్‌గా ఎంపిక కావడానికి నగర పంచాయతీ కమిషనర్ మల్లికార్జునస్వామి కృషి చేశారు.

WARANGAL RURAL

పనుల ఊసే లేదు

పరకాల(వరంగల్ రూరల్ జిల్లా): వరంగల్ రూరల్ జిల్లాలోని పరకాల నగరపంచాయతీ ఆధ్వర్యంలో 20 వార్డులు ఉండగా 30వేలకు పైబడి జనాభా ఉంది. ఇందులో 1008మంది లబ్దిదారులు దరఖాస్తులు చేసుకోగా అందులో నుండి 868మందిని ఎంపిక చేశారు. ఇందులో కేంద్రప్రభుత్వం ప్రతి లబ్దిదారునికి రూ. 8వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 4వేలు మొత్తం రూ. 12వేలను చెల్లించన్నారు. ఆగస్టు 1వ తారీఖు వరకు మరుగుదొడ్ల నిర్మాణం వంద శాతం పూర్తి చేయాలని అధికారులు చెబుతున్నప్పటికీ 230 మరుగుదొడ్లను పూర్తి చేయగా 165 మరుగుదొడ్లు వివిధ స్టేజీలలో నిర్మాణాలు జరుగుతున్నాయి. నేటి వరకు పనులు ప్రారంభించని లబ్ధిదారులు 65 మంది ఉన్నారు. అధికారులు నేరుగా ఈ కుటుంబాలను కలిసి పనులు ప్రారంభించినప్పటికీ వారంలో పూర్తి చేయడం కష్టమే.

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..
1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 1

1. **చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక**
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. **విటమిన్ ఎ : రేచీకటి :: ----- : రికెట్స్**
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. **పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----**
ఎ) కెరొటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. **ధర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : --------**
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : **ఎ**
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం ధర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. **రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------**
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: **సి**
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. **పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------**
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. **రైతు : నాగలి :: సైనికుడు: ---------**
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. **పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---**
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: **డి**
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. **బలం: వాట్ :: విద్యుత్ : --------**
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: **సి**
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్‌కు ప్రమాణం ఆంపియర్

10. **ముఖేష్: హాకీ :: చెస్ : -------**
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: **బి**
వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. **కొలంబో : శ్రీలంక :: ------ : ఆఫ్ఘనిస్థాన్**
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్

12. **హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----**
ఎ) చెన్నై బి) పనాజి సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: **ఎ**
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. **భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: -------**
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరతనాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. **న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : --------**
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. **చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------**
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: **బి**
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. **ఇండియా : రూపాయి :: జపాన్ : -------**
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: **సి**
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. **గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : -----------**
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: **డి**
